



నిరాహారదీక్ష చేస్తున్న పల్లడం రైతులు

పంటపొలాల్లో గ్యాస్ పైప్‌లైన్

నిరసనగా రైతుల నిరాహారదీక్ష

చెన్నై, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో గెయిల్ సంస్థ పైప్‌లైన్ల ప్రాజెక్టును పంట పొలాల్లో అమలు చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ఖండిస్తూ తిరుప్పూరు జిల్లా పల్లడం వద్ద రైతులు శనివారం ఉదయం నిరాహార దీక్ష నిర్వహించారు. 2011లో గెయిల్ సంస్థ కేరళ రాష్ట్రం కొచ్చిన్ నుంచి కోయంబత్తూరు, తిరుప్పూరు, ఈరోడ్, సేలం, నామక్కల్, ధర్మపురి, కృష్ణగిరి మీదుగా బెంగళూరు దాకా వ్యవసాయ భూముల్లో గ్యాస్ పైప్‌లైన్లు అమర్చే ప్రాజెక్టును అమలు చేసేందుకు ప్రయత్నించింది. అప్పటి ముఖ్యమంత్రి జయలలిత ఎట్టి పరిస్థితుల్లోనూ పంట పొలాల్లో గ్యాస్ పైప్‌లైన్లను అమర్చకూడదంటూ నిరసన ప్రకటించారు. రహదారుల పక్కగానే గ్యాస్‌పైప్‌లైన్లను అమర్చుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో గతంలో కోయంబత్తూరు జిల్లా సూలూరు ప్రాంతంలో అమర్చిన గ్యాస్‌పైప్‌లైన్ల పొడిగింపు కోసం కొత్తగా గ్యాస్‌పైప్‌లైన్లను భూమిలో పాతే పనులను గెయిల్ సంస్థ ప్రారంభించింది. ఆ మేరకు తిరుప్పూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లోని పంటపొలాల్లో గ్యాస్ పైప్‌లైన్లు అమర్చేందుకు సంస్థ అధికారులు పరిశీలన జరిపారు. ఈ పరిస్థితులలో తమ ప్రాంతంలో గ్యాస్ పైప్‌లైన్లను అమర్చకూడదని డిమాండ్ చేస్తూ పల్లడం సమీపం సుక్కంపాళయం గ్రామంలో రైతులు నిరాహార దీక్షను చేపట్టారు.

అరుంధతీయులకు 6 శాతం వాటా


ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలంటూ తమిళనాడు ప్రభుత్వానికి మంద కృష్ణమాదిగ విజ్ఞప్తి



డాక్టర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రాం తదితర మహనీయులకు నివాళులర్పిస్తున్న మంద కృష్ణమాదిగ, లోకేష్ కుమార్ తదితరులు

ప్యారీస్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో తరతరాలుగా నివసిస్తూ రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యులైన అరుంధతీయులకు 3 శాతం ఎస్సీ వర్గీకరణను 6 శాతానికి పెంచాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అరుంధతీయ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్)-తమిళనాడు విభాగం అధ్యక్షుడు లోకేష్ కుమార్ అధ్యక్షతన స్థానిక చెట్‌పెట్‌లోని వరల్డ్ యూనివర్సిటీ సర్వీస్ సెంటర్‌లో 'భారత రాజ్యాంగ విజయం'పై మహానాడు ఘనంగా జరిగింది. ఈ మహానాడుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మంద కృష్ణమాదిగ ముందుగా వేదికపై ఏర్పాటుచేసిన అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రాం, జ్యోతిరావు పూలే తదితర నాయకుల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పునివ్వడం 30 ఏళ్ల ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితమేనన్నారు. తమిళనాడు జనాభాలో అత్యధిక మెజార్టీ కలిగిన అరుంధతీయులకు న్యాయం కల్పించేలా దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి ఎస్సీ రిజర్వేషన్‌లో 3 శాతం అంతర్గత రిజర్వేషన్ కల్పించారని, ఆయనకు మాదిగలు రుణపడి ఉంటారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం కూడా ఈ రిజర్వేషన్‌ను అమలు పరచడాన్ని స్వాగతిస్తూ ధన్యవాదాలు తెలిపారు. అరుంధతీయులకు కల్పించిన 3 శాతం రిజర్వేషన్‌ను 6 శాతం పెంచి ఆదుకోవాలని సభాముఖంగా సీఎం స్టాలిన్‌కు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు లోకేష్ కుమార్ కృషిచేయాలని సూచించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేలా సుప్రీంతీర్పును అమలు చేయాలన్న కోరికతో తాను పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులను సంప్రదిస్తున్నానని, ఈ క్రమంలో ఈనెల 5న ఏపీ సీఎం చంద్రబాబును కలుసుకున్నానని, అప్పుడు మాదిగలకు మేలు చేకూర్చేలా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్‌మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిటీని నియమిస్తున్నట్లు తెలిపారని గుర్తు చేశారు ఈ కమిటీచే త్వరగా వర్గీకరణ ప్రక్రియ పూర్తిచేయించి నివేదికను స్వీకరించి, సంపూర్ణ న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎంఎం కొండయ్య, కె.సుకుమార్, ఇరకట్ల నాగభూషణం, దర్శిగుంట కిషోర్, వసంతరావు, ఎస్.ఆనందరావు, పుల్లాపురం కె.కుమార్, ఆది తమిళర్ పార్టీ అధ్యక్షులు జక్కయ్యన్, అరుల్ ఒలి ఆనందరాజ్, బి.మునుస్వామి, విశ్వప్రసాద్, ఇలారి దేవదానం, మెండెం కృష్ణమూర్తి, పలు జిల్లాలు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు కూడా పాల్గొన్నారు.

ఢిల్లీ వెళ్లిన గవర్నర్



ఆర్ఎన్ రవి

ప్యారీస్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఆర్ ఎన్ రవి శనివారం ఉదయం దేశ రాజధాని ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. రెండు రోజుల పర్యటన కోసం గవర్నర్ తన సహాయకులు, భద్రతా అధికారులతో కలసి ఉదయం 11.15 గంటలకు ఎయిర్ ఇండియా విమానంలో చెన్నై నుంచి ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. ఈ పర్యటన గవర్నర్ వ్యక్తిగతమని, ఢిల్లీ పర్యటనకు ఎలాంటి ప్రాధాన్యం లేదని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి.

ముట్టుకాడులో ఫ్లోటింగ్ రెస్టారెంట్

- నిర్మాణ పనుల్ని పరిశీలించిన మంత్రి రాజేంద్రన్



ముట్టుకాడు బోట్ హౌస్‌ను పరిశీలిస్తున్న పర్యాటక శాఖ మంత్రి రాజేంద్రన్

ప్యారీస్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా ఈస్ట్‌కోస్ట్ రోడ్డులో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి శాఖ నిర్వహణలోని ముట్టుకాడు బోట్ హౌస్‌లో ఫ్లోటింగ్ రెస్టారెంట్, కోవలంలో ఉన్న బ్లూ బీచ్ నిర్మాణాలను పర్యాటక శాఖ మంత్రి ఆర్.రాజేంద్రన్ ఆ శాఖ అధికారులతో కలసి శనివారం పరిశీలించారు. ముట్టుకాడు బోట్ హౌస్‌లో మరపడవలు, నాటు పడవలు, స్పీడ్ పడవలు అని 30కి పైగా పడవల్లో పర్యాటకులు విహరించేందుకు పోటీ పడుతుంటారు. ముఖ్యంగా సెలవు రోజులైన శని, ఆదివారాల్లో కుటుంబ సభ్యులతో సరదాగా గడిపేందుకు పెద్దసంఖ్యలో తరలి వస్తుంటారు. ఈ నేపథ్యంలో, పర్యాటకుల కోసం బోట్ హౌస్‌లో రూ.5 కోట్లతో 125 అడుగుల పొడవు, 25 అడుగుల వెడల్పు, రెండతస్తులతో ఆధునిక వసతులతో ఫ్లోటింగ్ రెస్టారెంట్ నౌకను డిజైన్ చేశారు. ఈ నౌకలో కింది అంతస్తు ఏసీ వసతి కలిగి ఉండగా, పై అంతస్తులో వంట గది, సందర్శకులు వీక్షించేందుకు వసతి కల్పించారు. ఈ ఫ్లోటింగ్ నౌకను రాష్ట్ర పర్యాటక శాఖ, కొచ్చిన్‌కు చెందిన గ్రాండ్ యురేన్ మెరైన్ ఇంటర్నేషనల్ సంస్థలు సంయుక్తంగా రూపొందించాయి. సంవత్సరం రోజులుగా ఈ ఫ్లోటింగ్ నౌక నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ముగింపు దశలో ఉన్న పనులను మంత్రి నేరుగా పరిశీలించారు. అనంతరం అక్కడి నుంచి సమీపంలో ఉన్న కోవలం ప్రాంతానికి వెళ్లి బ్లూ బీచ్ తీరాన్ని పరిశీలించారు. మంత్రి వెంట తిరుపోరూర్ ఎమ్మెల్యే బాలాజి, పర్యాటక శాఖ డైరెక్టర్ శిల్పా సుధాకర్ సతీష్, చెంగల్పట్టు జిల్లా కలెక్టర్ అరుణ్‌రాజ్, సబ్‌కలెక్టర్ నారాయణ శర్మ, ప్రభుత్వ అధికారులు, స్థానిక సంస్థల ప్రతినిధులు ఉన్నారు.

ప్రభుత్వంలో మిత్రపక్షాలకు నో ఛాన్స్

- మంత్రి ఐ. పెరియసామి స్పష్టీకరణ
- సంకీర్ణంపై దృష్టి: కాంగ్రెస్ ఎంపీ కార్తీ




దిండుగల్ జిల్లా పిళ్లయార్‌నత్తం గ్రామసభలో ప్రసంగిస్తున్న మంత్రి పెరియసామి

చెన్నై, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): డీఎంకే కూటమిలో సీట్ల పంపిణీకి మాత్రమే మిత్రపక్షాలకు భాగస్వామ్యం ఉంటుందని, అధికారంలో భాగస్వామ్యం ఇచ్చే అవకాశమే లేదని మంత్రి ఐ.పెరియసామి స్పష్టం చేశారు. శనివారం ఉదయం దిండుగల్ జిల్లా పిళ్ళయార్‌నత్తంలో జరిగిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు, మహిళా స్వయం సహాయక సభ్యులను ఆయన శాలువలతో సత్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో మూడున్నర సంవత్సరాలుగా సాగుతున్న ద్రావిడ తరహా డీఎంకే పాలననను ప్రజలంతా మెచ్చుకుంటున్నారని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపట్ల కూడా సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. డీఎంకేలో ఎప్పుడూ పొత్తులు, సీట్ల పంపిణీకి సంబంధించి మాత్రమే మిత్రపక్షాలకు భాగస్వామ్యం ఉంటుందని, అయితే అధికారంలో భాగస్వామ్యానికి అవకాశం లేదని స్పష్టం చేశారు. కలైంజర్ గృహనిర్మాణ పథకం ద్వారా ఇళ్లులేని పేదలకు గృహాలను నిర్మించి ఇస్తున్నామని చెప్పారు. గ్రామసభలో కలెక్టర్ పూంగొడి, డీఎంకే సభ్యుడు అత్తూరు నగటరాజన్, జిల్లా పంచాయతీ యూనియన్ అధ్యక్షుడు భాస్కరన్ ఆత్తూరు సర్పంచు మహేశ్వరీ మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

భాగస్వామ్యంపై దృష్టి: కార్తీ

రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామ్యం పొందే విషయంపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టిని సారిస్తోందని ఆ పార్టీ ఎంపీ కార్తీచిదంబరం పేర్కొన్నారు. శనివారం ఉదయం శివగంగ జిల్లా కూత్తలూరు గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సర్పంచు, వార్డు సభ్యులు, స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారంలో భాగస్వామ్యం పొందుతామని డీపీఐ నేత తొల్‌తిరుమావళవన్ చెప్పడం కూటమి ధర్మానికి విరుద్ధం కాదని, ఏ రాజకీయ పార్టీ అయినా అధికారంలోకి రావాలనే కోరుకుంటుందన్నారు. ఆ కోవలోనే డీపీఐ అధికారంలో పాలు పంచు కోవాలను కోవడం తప్పు కాదన్నారు. రాష్ట్రంలో 1967లో అధికారం కోల్పోయిన కాంగ్రెస్ మళ్ళీ కామరాజర్ పాలన ఏర్పాటు కోసం సుదీర్ఘ ప్రయత్నాలే చేస్తోందని చెప్పారు. కామరాజర్ పాలన ఇప్పటికిప్పుడు ఏర్పాటయ్యే అవకాశాలు లేకపోయినా పార్టీ నాయకులు, కార్యకర్తలంతా కలిసికట్టుగా ప్రయత్నాలు సాగిస్తే ఆ లక్ష్యాన్ని సాధించవచ్చున్నారు. తొలుత పార్టీని రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పరచాలని, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నించి వారి ఆదరణను పొందాలన్నారు. ఇవన్నీ జరిగితేనే కామరాజర్ పాలన వస్తుందన్నారు. పార్టీని పటిష్ఠ పరుస్తూనే సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామ్యం పొందే విషయంపై కూడా ప్రధానంగా దృష్టి సారించాలని, ఆ తర్వాతే కాంగ్రెస్ సొంత బలంతో అధికారంలో రాగలుగుతుందని కార్తీ చిదంబరం అన్నారు. రాష్ట్రంలో వ్యక్తిగత కక్షలతో జరుగుతున్న హత్యలను సాకుగా చూపి శాంతి భద్రతలు క్షీణించాయని భావించడం తప్పు అని, అదే సమయంలో ఈ సంఘటనలు పాఠశాలలు, ఆస్పత్రులలో వద్ద జరుగటాన్ని ప్రజలు సహించలేకపోతున్నారని చెప్పారు. ఇకనైనా ఆస్పత్రులు, విద్యాసంస్థల వద్ద నేరాలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పారిశ్రామికవేత్త అదానీ అవినీతి అక్రమాలపై పార్లమెంటరీ ఉమ్మడి కమిటీ ద్వారా విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కాగా అధికార భాగస్వామ్యంపై ఒకే కూటమి నేతలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది.



శివగంగ జిల్లా కూత్తలూరు గ్రామసభలో ప్రసంగిస్తున్న కార్తీ చిదంబరం

రైతులకు విజయ్ విందు



విందు కార్యక్రమంలో పాల్గొన్న రైతులకు అభివాదం చేస్తున్న విజయ్

చెన్నై, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా విక్రవాండిలో తమిళగ వెట్రి కళగం (టీవీకే) తొలి మహానాడుకు స్థలమిచ్చిన రైతులను శనివారం ఉదయం ఆ పార్టీ నేత, నటుడు విజయ్ ఘనంగా సత్కరించారు. అదే సమయంలో అందరికీ ప్రత్యేక విందు కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశారు. విక్రవాండి మహానాడు కోసం వి.సాలై వద్ద సుమారు 170 ఎకరాల విస్తీర్ణం కలిగిన స్థలాన్ని ఉపయోగించుకోవడానికి అక్కడి పంటలు పండించే రైతులు అనుమతించిన విషయం తెలిసిందే. అక్కడ జరిపిన పార్టీ మహానాడు ఘన విజయం సాధించడంతో స్థలమిచ్చిన రైతులను ఘనంగా సత్కరించాలని విజయ్ నిర్ణయించారు. ఆ మేరకు పనయూరులో ఉన్న టీవీకే ప్రధాన కార్యాలయంలో భారీ ఏర్పాట్లు చేపట్టారు. రైతులకు విందు నిచ్చేందుకు అనువుగా తగిన సదుపాయాలు కల్పించారు. ఆ తర్వాత మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీఆనంద్ తదితర పార్టీ ప్రముఖులతోపాటు విజయ్ ఆ ప్రాంతానికి చేరుకున్నారు. రైతులందరినీ శాలువలతో సత్కరించి విజయ్ ధన్యవాదాలు తెలిపారు. ఆ తర్వాత రైతులందరికీ ప్రత్యేక విందును ఏర్పాటు చేసిన శాఖాహార వంటకాలను వడ్డించారు. ఆ సందర్భంగా విజయ్ రైతులందరికీ చేతులెత్తి నమస్కరిస్తూ, చేతులు ఊపుతూ వేగంగా నడచుకుంటూ కారెక్కి అక్కడి నుండి బయలుదేరి వెళ్లారు.

ఆలయ ఆస్తుల ఆక్రమణదారులను వేటాడుతున్నాం

మంత్రి శేఖర్ బాబు



అడయార్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆలయ భూములను ఆక్రమించుకున్న వారిపై వేట కొనసాగుతుందని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.6882 కోట్ల ఆలయ భూములను స్వాధీనం చేసుకున్నామన్నారు. స్థానిక పాడి పడవేట్టమ్మన్ ఆలయ ప్రాంగణం నుంచి శబరిమల భక్తుల కోసం 5 లక్షల బిస్కెట్ ప్యాకెట్లు, 2వేల ఫ్లాస్కులను శనివారం లారీద్వారా పంపించారు. ఈ వాహనాన్ని లాంఛనంగా ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ..తిరుచెందూరు ఆలయానికి చెందిన ఏనుగు విషయంలో అటవీశాఖ అధికారులు వాస్తవ పరిస్థితులను వివరించారన్నారు. బీజేపీ సీనియర్ నేత హెచ్.రాజా ఏ దేశంలో ఉన్నారో తెలియడం లేదన్నారు. రాష్ట్రంలో నెలకొనివున్న, జరుగుతున్న పనులు ఆయనకు తెలియవన్నారు. ఆలయాల్లోకి మొబైల్స్ ఫోన్లను తీసుకెళ్లకుండా ఉండేలా దశలవారీగా అమలు చేస్తామన్నారు. శబరిమల వెళ్ళే అయ్యప్ప భక్తులకు ఉపయోగపడేలా ప్రధాన కేంద్రకార్యాలయంలో 24గంటలపాటు పనిచేసే సమాచార కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే, ఈ యేడాదికి సంబంధించన అయ్యప్ప మలర్‌ను ఈనెల 25న మైలాపూర్‌లో జరిగే ఓ కార్యక్రమంలో ప్రారంభిస్తామన్నారు.

కమలాలయంలో ఆనందోత్సాహాలు

- మహారాష్ట్ర ఎన్నికల్లో ఎన్డీయే గెలుపు



బీజేపీ కార్యాలయం వద్ద మిఠాయిలు పంచుతున్న తమిళిసై

చెన్నై, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో ఎన్డీయే ఘనవిజయం సాధించడంతో టి.నగర్‌లోని బీజేపీ రాష్ట్ర శాఖ కార్యాలయం కమలాలయం వద్ద పార్టీ శ్రేణులు బాణసంచా పేల్చి, స్వీట్లు పంచి సందడి చేశారు. బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు తమిళిసై సౌందరరాజన్, పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పొన్నూరు రంగనాయకులు తదితర నేతలు పార్టీ కార్యకర్తలతో కలిసి సంబరాలు చేసుకున్నారు. భారీ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఆ మార్గంలో వెళుతున్న ప్రజలకు, కార్యాలయంలోని పార్టీ ప్రముఖులకు, నాయకులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా తమిళిసై మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పాలనకు అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పటానికి మహారాష్ట్రలో ఎన్డీయే ఘనవిజయమే నిదర్శనమని, త్వరలో రాష్ట్రంలోనూ బీజేపీ నాయకత్వంలో ఎన్డీయే గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రజలు నివసిస్తున్నారని, ఆ ప్రజలిచ్చిన తీర్పు మోదీ పాలనపై అన్ని రాష్ట్రాల ప్రజలు గట్టి మద్దతు ఇస్తున్నట్లుగానే భావించాల్సి ఉందన్నారు. జార్ఖండ్‌లో బీజేపీ కూటమి విజయం సాధించలేకపోయినా మునుపటి కంటే ఎక్కువ సీట్లు సంపాదించుకుందన్నారు. వయనాడులో ప్రియాంకగాంధీ గెలుపు వల్ల ఇండియా కూటమికి ఒరిగేదేమీ లేదని ఆమె విమర్శించారు.

రామనాథపురం జిల్లాలో భారీ వర్షం

జలదిగ్బంధంలో 100 గృహాలు



రామనాథపురంలోని గజినీనగర్‌లో మోకాలిలోతు వాన నీటిలో స్థానికులు

చెన్నై, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లాల్లో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. రామేశ్వరంలో ఒకే రోజు 44 సెం.మీ. వర్షం కురవడంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. ఈ నేపథ్యంలో సక్కరైకోట సమీపం గజినీ నగర్‌లో వందకు పైగా ఇళ్లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఆ ఇళ్లలో నివసిస్తున్నవారంతా మోకాలిలోతు వాననీటిలో నడచివెళుతున్నారు. తమ ప్రాంతంలో వాననీటిని తొలగించాలంటూ గత రెండు రోజులుగా గజినీ నగర్‌వాసులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఈ పరిస్థితులలో స్థానికులే వాననీటిని తొలగించే పనులు చేపట్టారు.

సమాచార ధ్వని

నేడు సుద్దాల అశోక్ తేజ ఉపన్యాసం

చెన్నై, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'వేద విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో ప్రముఖకవి, ఉత్తమ జాతీయ చలనచిత్ర గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ ఉపన్యాస కార్యక్రమం ఆదివారం జరుగనుంది. 'తరతరాల తెలుగు కవిత' ఉపన్యాస ధారావాహిక కార్యక్రమంలో భాగంగా 'శ్రీ శూద్ర గంగ - కావ్య పఠనం' అనే అంశంపై అశోక్‌తేజ ప్రసంగించనున్నారు. స్థానిక టి.నగర్ విజయరాఘవ రోడ్డులో వున్న ఆంధ్రా క్లబ్‌లో సాయంత్రం 6.30 గంటలకు జరుగనున్న ఈ కార్యక్రమానికి సాహితీ ప్రియులందరూ ఆహ్వానితులేనని సంస్థ అధ్యక్షుడు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

'సీఎం ఫార్మశీ' దరఖాస్తు సమర్పణ గడువు పెంపు

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లాల్లో 'సీఎం ఫార్మశీ' ఏర్పాటుకు సంబంధించి దరఖాస్తు సమర్పణ గడువును పొడిగించారు. ఈమేరకు సహకార శాఖ సబ్ రిజిస్ట్రార్ పేర్కొన్నారు. బి.ఫార్మ్, డి.ఫార్మ్ చేసిన జిల్లాకు చెందిన వారు ముఖ్యమంత్రి మెడికల్ షాపుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు సమర్పణ గడువు ఈనెల 20వ తేదీతో ముగియగా, అభ్యర్థుల కోరికమేరకు ఈనెల 30వ తేదివరకు పొడిగించినట్లు సబ్ రిజిస్ట్రార్ తెలిపారు.

రేషన్ దుకాణాల్లో కందిపప్పు కొరత లేదు

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో కందిపప్పు కొరత లేదని ఆహారశాఖ మంత్రి చక్రపాణి తెలిపారు. చెన్నై సహా అన్నిజిల్లాలకు 2,03,84,122 కిలోల కందిపప్పు కేటాయించగా,ఇప్పటివరకు 1,62,83,486 కిలోలు పంపించామన్నారు. ఈనెలకు సంబంధించి 92శాతం కార్డుదారులకు కందిపప్పు అందించామన్నారు. రేషన్‌దుకాణాల్లో 68,44,719 కిలోల కందిపప్పు, వినియోగదారుల వాణిజ్య సంస్థ గోదాముల్లో 66,91,000 కిలోల కందిపప్పు నిల్వలున్నాయని మంత్రి తెలిపారు.

బేకరీ ఉత్పత్తుల తయారీపై శిక్షణ

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అడ్వాన్స్ బేకరీ ఉత్పత్తుల తయారీ శిక్షణ ఈనెల 26 నుంచి 29వ తేది వరకు నిర్వహించనున్నారు. బేకరీ ఉత్పత్తుల ముడిపదార్థాలు, రెడ్ వెల్వెట్ కేక్, మిల్క్ కేక్, పిజ్జా, బర్గర్ సహా పలు ఉత్పత్తులపై శిక్షణ ఇవ్వనున్నారు. 18 ఏళ్లకు పైబడిన వారు www.editn.inలో తమ పేర్లు నమోదుచేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు స్థానిక ఈకాట్టుతాంగల్‌లోని రాష్ట్ర ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ కార్యాలయంలో కానీ నెం.8668102600, 7010143022లలో సంప్రదించవచ్చు.

మహిళా సేవా కేంద్రంలో ఉద్యోగావకాశాలు

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులు, ఇతర సమస్యలకు గురైన మహిళకు భద్రత, మానసిక సలహాలు అందించేలా చెన్నై జిల్లాలో ఇంటిగ్రేటెడ్ సర్వీస్ సెంటర్ పని చేస్తోంది. ఈ కేంద్రంలో ఖాళీగా ఉన్న కేస్ వర్కర్ పోస్టుకు సోషల్ వర్క్‌లో డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. రెండు సెక్యూరిటీ గార్డులు, రెండు సహాయకులపోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆసక్తి కలిగినవారు https://chennai.nic.in/లో డిసెంబరు 6వతేదిలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు చెన్నై కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని సాంఘీక సంక్షేమ శాఖ కార్యాలయాన్ని నేరుగా కానీ oscchennaib@gmail.com ఈ-మెయిల్ ద్వారా సంప్రదించవచ్చని జిల్లా కలెక్టరేట్ పేర్కొంది.

8న 'ధ్యాన యోగం'పై పోటీలు

చెన్నై, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీమత్ భగవద్గీత జయంతిని పురస్కరించుకుని టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో డిసెంబరు 8న చిన్నారులకు 'ధ్యాన యోగం - 6వ అధ్యాయం'పై పోటీలు జరుగనున్నాయి. టి.నగర్ వెంకటనారాయణ రోడ్డులో వున్న శ్రీవారి ఆలయ ప్రాంగణంలో ఉదయం 9గంటల నుంచి ప్రారంభమవుతాయి. అదేరోజు సాయంత్రం 4 గంటలకు బహుమతుల ప్రదానం ఉంటుంది. ధ్యాన యోగంపై గ్రూప్-1లో 6, 7 తరగతులకు, గ్రూప్2లో 8, 9 తరగతులకు పోటీలు ఉంటాయి. అదే విధంగా భగవద్గీతలోని 18 అధ్యాయాలపై గ్రూప్1లో 18 సంవత్సరాల్లోపు, గ్రూప్2లో 18 ఏళ్ల పైబడిన వారికి పోటీలు ఉంటాయి. వివరాలకు నెం.9444019640లో సంప్రదించవచ్చు.

ఘనంగా 'నేషనల్ ఫార్మసీ వీక్'

వేళచ్చేరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్‌లో ఉన్న శ్రీ రామచంద్ర ఇనిస్టిట్యూట్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్'లో శనివారం ఘనంగా 'నేషనల్ ఫార్మసీ వీక్ జరిగింది. ఇండియన్ ఫార్మసీ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ తమిళనాడు శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవానికి మూడు తరాల ఫార్మసిస్టులు హాజరవడం విశేషం. ఈ సందర్భంగా ఫార్మస్యూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (ఐపీజీఏ) ఛైర్మన్ ఎస్వీ వీరమణి మాట్లాడుతూ.. భారతీయ ఔషధాలు ప్రస్తుతం 200 దేశాలకు ఎగుమతి అవుతున్నాయని వివరించారు. ఐపీజీఏ మాజీ అధ్యక్షుడు, శ్రీరామచంద్ర మెడికల్ వర్సిటీ ఫార్మసీ విభాగ ప్రిన్సిపాల్ డాక్టర్ జెరాడ్ సురేష్ మాట్లాడుతూ.. డ్రగ్స్ ఉత్పత్తి, నియంత్రణకు సంబంధించిన కీలక విభాగాలు ఉండేలా సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ఫార్మసీ సబ్జెక్టులను చేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంకా తమిళనాడు డ్రగ్స్ కంట్రోల్ జాయింట్ డైరెక్టర్ పీయూ కార్తికేయన్, కొచ్చి పోర్ట్ ఇన్‌చార్జ్ కె.నరేంద్రన్ తదితరులు కూడా పాల్గొన్నారు.

పెరిగిన మునక్కాయల ధర

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు మార్కెట్లో కిలో మునక్కాయలు రూ.280కు విక్రయమవుతున్నాయి. ఇటీవల రూ.100గా ఉన్న ధర మార్కెట్‌కు దిగుమతులు తగ్గడంతో మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులు తెలిపారు.

మహారాష్ట్ర ఎన్నికల్లో మతతత్వ శక్తులు

బీజేపీపై టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై ఫైర్



కార్యకర్తలకు స్వీట్లు అందజేస్తున్న సెల్వపెరుందగై

ప్యారీస్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో బీజేపీ మతతత్వ శక్తులను ఉపయోగించి విజయం సాధించిందని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సెల్వపెరుందగై విమర్శించారు. రాయపేటలోని టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో జార్ఖండ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి ఘన విజయం సాధించడంపై శనివారం సంబరాలు జరుపుకున్నారు. అలాగే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వయనాడు లోక్‌సభ నియోజకవర్గంలో సుమారు 4 లక్షలకు పైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించడంపై కాంగ్రెస్ శ్రేణులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జరుపుకున్న సంబరాల్లో పాల్గొన్న సెల్వపెరుందగై పార్టీ నిర్వాహకులకు స్వీట్లు పంచి పెట్టారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మహారాష్ట్ర ఎన్నికల్లో అధికార, ధన బలంతో పాటు మతతత్వ శక్తులను ఉపయోగించి బీజేపీ గెలిచిందన్నారు. పదేళ్ల బీజేపీ పాలనలో ప్రజలకిచ్చిన హామీలు సక్రమంగా నెరవేర్చలేదన్నారు. దేశాన్ని సంపన్న దేశంగా మారుస్తామని చెప్పిన బీజేపీ పెద్దలు మాట నిలబెట్టుకోలేదని ఆయన విమర్శించారు.

రక్తదాతలే రియల్ హీరోలు

● అన్నాడీఎంకే రాష్ట్ర కార్యవర్గ కమిటీ సభ్యుడు సుందర్



రక్తదానం చేస్తున్న సుందర్, లయన్ జి.మురళి

ప్యారీస్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగుల కోసం రక్తదానం చేసేవారు సమాజంలో రియల్ హీరోలు అని అన్నాడీఎంకే రాష్ట్ర కార్యవర్గ కమిటీ సభ్యుడు ఎం.సుందర్ అభివర్ణించారు. స్థానిక పుళల్ కావాంగరై తిరు నీలకంఠన్ నగర్‌లో పుళల్ లయన్స్ క్లబ్ హ్యుమానిటీ జిల్లా 324 ఆధ్వర్యంలో శనివారం ఉదయం లయన్స్ క్లబ్ మొబైల్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని సుందర్ ప్రారంభించి రక్తదానం చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సాగిన ఈ శిబిరంలో సుమారు 100 మంది రక్తదానం చేశారు. లయన్స్ క్లబ్ హ్యుమానిటీ 324 జిల్లా గవర్నర్ ఏటీ రవిచంద్రన్ సూచనల మేరకు నిర్వహించిన ఈ శిబిరం ఏర్పాట్లను క్లబ్ ప్రెసిడెంట్ కేఎం ప్రకాష్, ఫౌండర్ లయన్ రవి, లయన్ జి.మురళి, సభ్యులు ఎస్.రమేష్, సుమన్, బి.బాలాజి, జీవీ రామకృష్ణ, ఎం.చిట్టిబాబు, పి.నరసింహారావు తదితరులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో భాగంగా రక్తదాతలకు క్లబ్ తరఫున ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

'సంగమం-నమ్మ ఊరు తిరువిళా' కళా ప్రదర్శనలకు ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ కళలు, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో చెన్నైలో వచ్చే ఏడాది జనవరిలో సంక్రాంతి పండుగ సందర్భంగా 'సంగమం-నమ్మ ఊరు తిరువిళా' పేరుతో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు. నగరంలోని 8 ప్రాంతాల్లో నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో పాల్గొనేందుకు కళా బృందాల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కళా బృందాలు www.artandculture.tn.gov.in అనే వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్ లోడ్ చేసుకొని, తమ వివరాలు, ప్రదర్శించే సాంస్కృతిక ప్రదర్శన తదితరాలు పూర్తిచేసి, డిసెంబరు 10వ తేదీలోపు కళలు, సాంస్కృతిక శాఖ మండల కార్యాలయాలకు పోస్టు ద్వారా పంపించాలని అధికారులు సూచించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలతో నిర్వాహకులు

వేలూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీఎంసీ ఆస్పత్రి ఆధ్వర్యంలో గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించేలా విద్యార్థులకు శుక్రవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 8 పాఠశాలలు పాల్గొనగా, మొదటి రెండు స్థానాల్లో స్ప్రింగ్ డే పాఠశాల, మూడో స్థానంలో ఇడాస్కడర్ పాఠశాల నిలిచాయి. విజేతలకు శనివారం బహుమతులు, షీల్డులు అందజేశారు. పోటీలను సీఎంసీ కార్డియాలజీ వైద్యులు హెన్స్ రాజా, రాజ్‌కుమార్ పర్యవేక్షించారు.

గ్రామసభలో పాల్గొన్న కలెక్టర్ సుబ్బులక్ష్మి



గ్రామసభలో కలెక్టర్ సుబ్బులక్ష్మి, ఎమ్మెల్యే ఈశ్వరప్పన్ తదితరులు

వేలూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కనియంబాడి పంచాయతీ యూనియన్ పరిధిలోని వల్లమ్ పంచాయతీలో శనివారం గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ దినం సందర్భంగా నిర్వహించాల్సిన గ్రామసభలను దీపావళి మరుసటిరోజు కావడంతో నవంబరు 1వ తేది ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించి, 23న గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. ఆ ప్రకారం, జిల్లాలోని 247 పంచాయతీల్లో శనివారం గ్రామసభలు జరిగాయి. వల్లమ్ పంచాయతీ అధ్యక్షుడు శివకుమార్ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో కలెక్టర్ సుబ్బులక్ష్మి, ఆర్కాడు ఎమ్మెల్యే ఈశ్వరప్పన్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు శాఖలు తమ పథకాలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశాయి. కార్యక్రమంలో కనియంబాడి యూనియన్ కమిటీ అధ్యక్షుడు కమల ప్రసాద్, పంచాయతీల అసిస్టెంట్ డైరెక్టర్ ఉమ, యూనియన్ కమిటీ ఉపాధ్యక్షుడు గజేంద్రన్, జిల్లా పంచాయతీ కమిటీ సభ్యుడు ఎయల్‌అరసి సహా పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉచితంగా రామచిలుకల సందర్శన

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక చింతాద్రిపేటకు చెందిన సుదర్శన్-విద్య దంపతులు తమ ఇంటి మేడపై రామచిలుకలను సంరక్షిస్తున్నారు. నటుడు కార్తీ, అరవింద్ స్వామి, రాజ్‌కిరణ్, శ్రీదివ్య తదితరులు నటించిన 'మెయ్యగళన్' చిత్రంలో, సుదర్శన్ ఇంట్లో సంరక్షిస్తున్న రామచిలుకలతో కూడిన దృశ్యాలు ఉన్నాయి. ప్రస్తుతం సుదర్శన్ ఇల్లు పర్యాటక కేంద్రంగా మారింది. ఈ క్రమంలో, రామచిలుకలను ప్రతిరోజు సాయంత్రం 4.30 గంటల నుంచి ఉచితంగా వీక్షించవచ్చని, రోజుకు 25 మందికి ఈ అవకాశం కల్పిస్తున్నట్లు సుదర్శన్ దంపతులు తెలిపినట్లు సమాచారం.

అన్బుమణితో పార్టీ నాయకుల భేటీ



అన్బుమణితో చెంగల్పట్టు జిల్లా నేతలు

వేళచ్చేరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్‌ను శనివారం చెంగల్పట్టు జిల్లా పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. చెంగల్పట్టు వెస్ట్ పసుమై తాయగం జిల్లా కార్యదర్శి పమ్మల్ పీఎస్ఎస్ రాజేంద్రన్ తన జన్మదినం సందర్భంగా అన్బుమణిని కలుసుకొని ఆయన ఆశీస్సులు పొందారు. ఈ భేటీలో పసుమై తాయగం రాష్ట్ర సహాయ కార్యదర్శి లయన్ ఎన్.కన్నన్, పీఎంకే జిల్లా కార్యదర్శి వెంకటేశన్, జిల్లా సహాయ కార్యదర్శి పూక్కడై మునుస్వామి తదితరులు పాల్గొన్నారు.

దినకూలీ వేతనంపై ప్రొఫెసర్లు

● అన్నావర్సిటీ నిర్ణయం ఉపసంహరణ

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దినకూలీ వేతనంతో ప్రొఫెసర్లను నియమించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకున్న అన్నా విశ్వవిద్యాలయం బోధనేతర సిబ్బందిని అవుట్ సోర్సింగ్ ద్వారా నియమించుకోవాలని సూచించింది. అన్నా వర్సిటీ అనుబంధ కళాశాలల్లోని ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బంది పోస్టులను తాత్కాలిక పద్ధతితో నియమిస్తున్నారు. ఈ నియమాకాలు చేపట్టినా పోస్టులు అధిక సంఖ్యలో ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేసేలా, ప్రొఫెసర్ల పోస్టులను దినకూలీ వేతనంతో నియమించాలని ఇటీవల వర్సిటీ సిండికెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయంపై ప్రతిపక్ష పార్టీలు, విద్యావేత్తలు తీవ్ర నిరసన వ్యక్తం చేయడంతో, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు వర్సిటీ ప్రకటించింది.

జిల్లాస్థాయి సైన్స్ పోటీలు



పోటీల ప్రారంభోత్సవంలో అతిథులు, నిర్వాహకులు

వేలూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు సైన్స్ ఫోరం (టీఎన్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జిల్లా స్థాయి సైన్స్ పోటీలు నిర్వహించారు. కాట్పాడి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో 23 పాఠశాలలకు చెందిన టీంలు పాల్గొన్నాయి. కార్యక్రమానికి పాఠశాల విద్యాశాఖ జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి జ్యోతీశ్వర పిళ్లై అధ్యక్షత వహించగా, పథక ప్రాజెక్ట్ డైరెక్టర్ సుకుమారన్ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా సెక్రటరీ జనార్దనన్, నిర్వాహకులు సుబ్రమణి, కుమరన్, విశ్వనాథన్, శరవణన్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు తాము రాసిన పత్రాలను పోటీల ఆర్గనైజర్లు వెన్నెల, సరస్వతికి అప్పగించారు. విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని నిర్వాహకులు తెలిపారు.

కాటంరెడ్డి సుశీలమ్మకు నివాళి



సుశీలమ్మకు నివాళులర్పిస్తున్న ఆనంద్‌కుమార్‌రెడ్డి కుటుంబీకులు

చెన్నై, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చెన్నై సమాచారకేంద్ర సలహామండలి మాజీ అధ్యక్షుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త కాటంరెడ్డి ఆనంద్‌కుమార్‌రెడ్డి మాతృమూర్తి కాటంరెడ్డి సుశీలమ్మ ఇటీవల కన్నుమూశారు. శనివారం నగరంలో ఆమె దశదినకర్మ జరగ్గా.. పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై సుశీలమ్మకు నివాళులర్పించారు. టీటీడీ సలహామండలి మాజీ అధ్యక్షుడు ఏజే శేఖర్‌రెడ్డి, కెన్సెస్ గ్రూపు సంస్థల అధినేత కె.నరసారెడ్డి, సీఈవో ఎం.కృష్ణ, శ్రీసిటీ నిర్వాహకులు రవి సన్నారెడ్డి, రాష్ట్ర మాజీ డీజీపీ శేఖర్, టీటీడీ సలహామండలి మాజీ సభ్యులు అనిల్‌కుమార్‌రెడ్డి, పీవీ కృష్ణారావు, మోహన్‌రావు, ఎం.రవిబాబు, రంగారెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు శంకర్, టీటీడీ ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సుమతి, కృష్ణాగ్రూప్ ఛైర్మన్ కృష్ణారెడ్డి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

భళా... మారథాన్‌లో తెలుగోడి ప్రతిభ



అడయార్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మందవెల్లికి చెందిన తెలుగుతేజం విజయ్ బొడ్డుపల్లి మారథాన్ పోటీల్లో రాణిస్తున్నారు. చెన్నై మహానగరంలో పుట్టి పెరిగిన విజయ్... 10 కిలోమీటర్ల విభాగంలో 50 మారథాన్లు, 50 హాఫ్ మారథాన్ పోటీలను చెన్నై నగరంలోనే విజయవంతంగా పూర్తి చేయడం గమనార్హం. స్థానిక డీడీ కేంద్రం ఉన్న శివానంద సాలైలో 10కె నిర్వహించారు. ఇది విజయ్‌కు 50వ మారథాన్. ఓవరాల్‌గా ఇప్పటి వరకు 112 ఈవెంట్స్‌ను విజయవం తంగా పూర్తి చేశాడు. అలాగే, 2019 ఆగస్టులో 50వ హాఫ్ మారథాన్‌ని పూర్తి చేయగా, ఇప్పటివరకు ఓవరాల్‌గా 56 హాఫ్ మారథాన్లను పూర్తి చేశాడు. అలాగే, బెంగాల్ రాజధాని కోల్‌కతాలో నేడు జరిగే 10కె పరుగుపందెంతో తన 51వ మారథన్ పోటీని పూర్తి చేయనున్నాడు. కాగా, విజయ్ ఇప్పటివరకు మూడు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులను, మూడు ఇండియా బుక్ ఆఫ్ రికార్డులను, రెండు తెలుగు బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు దక్కించుకున్నాడు.

అయ్యప్ప స్వామిపై దోషపూరితంగా పాట

దర్శకుడు, గాయనిపై ఫిర్యాదు

అడయార్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి గురించి దోషపూరితంగా పాట పాడినందుకు సినీ దర్శకుడు పా.రంజిత్, గాయని ఇసైవాణిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అయ్యప్ప భక్తులు కోయంబత్తూరు జిల్లా మేట్టుపాళెయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయ్యప్పస్వామిని, ఆయన్ను ఆరాధిస్తూ భక్తులు చేపట్టే దీక్ష తదితర అంశాలపై రాసిన పాట భక్తుల మనోభావాలు దెబ్బతినేలా, దోషపూరితంగా ఉందనీ, ఇందుకు కారణమైన నేపథ్యగాయని ఇసైవాణి, నీలం కల్చరల్స్ సెంటర్ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు పా.రంజిత్‌పై చర్యలు తీసుకోవాలని అఖిల భారత అయ్యప్ప భక్తుల సంఘం అధ్యక్షుడు సెల్వరాజ్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

'పింక్ ఆటో' దరఖాస్తు గడువు పొడిగింపు

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో మహిళ భద్రత కోసం అమలు చేయతలపెట్టిన 'పింక్ ఆటో' కోసం దరఖాస్తు సమర్పణ గడువు పొడిగించారు. మహిళలు, పిల్లలు సురక్షితంగా ప్రయాణించేలా నగరంలో 250 ఆటోలను మహిళా డ్రైవర్లతో నడపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అర్హులైన మహిళలు ఈ పథకంలో దరఖాస్తు సమర్పణ గడువు శనివారంతో ముగియనున్న నేపథ్యంలో, డిసెంబరు 10వ తేది వరకు పొడిగించారు. ఈ పథకంలో చేరగోరు మహిళలు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన తొలగించారు. నిరుపేద మహిళలు, ఒంటరి మహిళలకు ప్రాధాన్యం ఇవ్వనుండగా, వయోపరిమితి 25 నుంచి 45గా నిర్ణయించారు.

నయనానందకరం నాట్య ప్రదర్శనం

వేళచ్చేరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దుర్గా స్రవంతి (సాంస్కృతిక విభాగం), దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ (చెన్నై) సంయుక్త నిర్వహణలో ప్రదర్శించిన 'కిన్నెరసాని' నృత్య నాటిక ప్రేక్షకులను ముగ్ధులను చేసింది. స్థానిక మైలాపూర్‌లోని లజ్ చర్చి రోడ్డులో ఉన్న ఆంధ్ర మహిళా సభ ఈ కార్యక్రమానికి వేదికైంది. శనివారం ఉదయం 11 గంటలకు వసుంధరా దేవి ప్రార్థనాగీతంతో సభకు శుభారంగం జరిగింది. భారతి సభికులకు స్వాగతం పలికారు. సరస్వతి నాట్య గురు కళారత్న డాక్టర్ మాధవి మల్లంపల్లి గురించి మాట్లాడుతూ... ఆమె చెన్నై దూరదర్శన్‌లో ఏ గ్రేడ్ ఆర్టిస్టుగా ఉన్నారని, కూచిపూడి నృత్య కళాకారిణిగా ఎన్నో పురస్కారాలు అందుకున్నారని, ఆమెను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'కళారత్న' బిరుదుతో సత్కరించిందని, ఇంకా 'నాట్యప్రజ్ఞ', 'కళామృతవర్షిణి' మొదలైన బిరుదులు ఆమెను వరించాయని, ప్రఖ్యాత సినీ నటులు చంద్రమోహన్, రచయిత్రి జలంధర్ కుమార్తెగా, తల్లిదండ్రులకు కీర్తిప్రతిష్ఠలు తెచ్చారని తెలిపారు. ఆయుర్వేద వైద్యంలో కూడా దిట్ట అయిన మాధవి మల్లంపల్లి 'మధుర కళానికేతన్' నృత్య పాఠశాలను చాల ఏళ్లుగా నిర్వహిస్తూ ఎంతోమంది విద్యార్థులకు నాట్యంలో శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. మాధవి ఆధ్వర్యంలో ఆమె శిష్యురాళ్లు, ఆమె కలసి ప్రదర్శించిన 'కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ విరచిత 'కిన్నెరసాని' నృత్య నాటిక ఆద్యంతం ప్రేక్షకులను అలరించింది. కళాకారిణుల హావభావాలు, అభినయం ఒకదానితో ఒకటి పోటీపడ్డాయి. కిన్నెర, ఆమె భర్త అన్యోన్యత, అత్తగారి ఆరళ్లు, అది తట్టుకోలేని కిన్నెర అడవి బాట పట్టడం, భర్త కౌగిలిలో కరిగి నీరై ప్రవహించడం, భర్త శిలారూపం చెందడం, సముద్రుడి మోహం, గోదావరి అభయం తదితర విశేషాలను మాధవి నృత్యనాటికగా మలచిన తీరు అత్యద్భుతమని ప్రేక్షకులు ప్రశంసించారు. మహాకవి విశ్వనాథ సత్యనారాయణ గురించి ముళ్లపూడి శ్రీదేవి రాసిన విశేషాలకు లావణ్య తన గళ సహకారం అందించారు. అలాగే, శ్రీదేవి రాతలోని అక్షరాలకు తన స్వరాన్ని పలికిస్తూ కిన్నెరసాని కథను తెలిపారు పత్రి అనురాధ. విశ్వనాథ 'ఏకవీర' నవల సినిమాగా తీయబడిందని తెలిపి ఆ చిత్రంలోని పాటలను వసుంధర, ఎస్వీ వసంతలక్ష్మి హృద్యంగా ఆలపించారు. సరస్వతి సమర్థవంతంగా కార్యక్రమాన్ని నడిపించారు. కార్య నిర్వాహకులు కళాకారులను సత్కరించారు. డాక్టర్ అముక్తమాల్యాద వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. నిర్వాహకులు ఆహూతులకు రుచికరమైన భోజనంతో విందు గావించారు.



కళాకారులతో అతిథులు, నిర్వాహకులు

మహిళా ఎస్పీపై లైంగిక వేధింపుల కేసులో

రిటైర్డ్ ఐజీకి అరెస్టు వారెంట్



మురుగన్

చెన్నై, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళా ఎస్పీపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో రిటైర్డ్ ఐజీ మురుగన్‌కు సైదాపేట కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసింది. రాష్ట్ర పోలీసు శాఖలో మురుగన్ ఐజీగా పనిచేశారు. 2017 -18లో చెన్నై ఆలందూరులోని అవినీతి నిరోధక విభాగం (ఏసీబీ) కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా ఆ కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఎస్పీపై ఆయన లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చాయి. మహిళా ఎస్పీకి అశ్లీల చిత్రాలతో కూడిన అసభ్యకరమైన సందేశాలను పంపినట్లు ఆ ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. ఈ కేసుపై విచారణ జరిపిన హైకోర్టు సీబీసీఐడీ విచారణకు ఆదేశాలిచ్చింది. ఆ తర్వాత ఈ కేసు విచారణను సైదాపేట 11వ మెట్రోపాలిటన్ కోర్టులో విచారణ జరిగింది. శుక్రవారం ఉదయం జరిగిన ఈ కేసు విచారణకు మాజీ ఐజీ మురుగన్ హాజరుకాలేదు. దీనితో కోర్టు ఆయనను అరెస్టు చేసి విచారణకు హాజరుపరచాలంటూ వారెంట్‌ను జారీ చేసింది.

మయూర జయకుమార్‌పై కేసు నమోదు

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి మయూర జయకుమార్‌పై హత్యా బెదిరింపు సహా రెండు సెక్షన్ల కింద పీలమేడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 17న కోవై విమానాశ్రయంలో కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కోవై సెల్వంపై దాడి చేశారనే ఫిర్యాదు నేపథ్యంలో, మయూర జయకుమార్‌పై కోవై పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కోవై సెల్వం ఫిర్యాదు చేశారు.

నక్షత్ర తాబేళ్లు తరలింపు

ఇద్దరికి రెడ్‌కార్నర్ నోటీసు

ప్యారీస్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విదేశాల నుంచి చట్టవిరుద్ధంగా విమానం ద్వారా నగరానికి నక్షత్ర తాబేళ్లు, నిషేధిత సముద్ర జీవరాశులను అక్రమంగా తరలించిన ఇద్దరికి కస్టమ్స్ శాఖ రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేసేందుకు చర్యలు చేపట్టింది. ఏప్రిల్‌లో మలేసియా, థాయ్‌లాండ్, సింగపూర్ తదితర దేశాల నుంచి చెన్నై విమానాశ్రయం మీదుగా సీహార్స్, నక్షత్ర తాబేళ్లు తదితరాలను స్మగ్లింగ్ చేసిన రవికుమార్‌ను కస్టమ్స్ అధికారులు అరెస్ట్ చేశారు. అతన్ని విచారించగా థాయ్‌లాండ్, మలేసియా దేశాల్లో ఉన్న ఇద్దరు తమిళులు వన్యప్రాణులు, ఇళ్లలో పెంచుకుంటున్న పక్షులు, ఏనుగు దంతాలు తదితరాలను ఆ దేశాల నుంచి సరఫరా చేస్తున్నట్లు తెలిసింది. విదేశాల్లో ఉన్న ఆ ఇద్దరు తమిళులను అరెస్ట్ చేసేందుకు కస్టమ్స్ శాఖ అధికారులు నిర్ణయించారు. అయితే ఇందుకు ఇంటర్‌పోల్ సహాయం అవసరం కావడంతో, దీనికి సంబంధించి రెడ్‌కార్నర్ నోటీసు పంపించాల్సిందిగా సీబీఐకి కస్టమ్స్ శాఖ ప్రతిపాదన పంపింది.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి



రోడ్డు పక్కనున్న వంతెన గోడను ఢీకొన్న కారు

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పిన కారు రోడ్డు పక్కనున్న వంతెన గోడను ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతిచెందారు. తిరుప్పూర్ జిల్లా పల్లడం ప్రాంతానికి చెందిన షణ్ముగసుందరం (45) మాలధారణ చేసుకొని దీపక్ అరవింద్ (26), నాగరాజ్ (34) సహా నలుగురితో కలసి కారులో శబరిమలకు వెళ్లాడు. అక్కడ స్వామి దర్శనం చేసుకొని రామేశ్వరం వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. రామేశ్వరం-మదురై జాతీయ రహదారి రామనాథపురం సమీపం కావనూరు వద్ద వస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న వంతెన గోడను ఢీకొంది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా, షణ్ముగసుందరం సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. చుట్టుపక్కల వారు కారు శిథిలాల నుంచి తీవ్ర గాయాలతో ఉన్న ముగ్గురిని వెలికి తీసి రామనాథపురం ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సలు ఫలించక దీపక్ అరవింద్, నాగరాజ్ మృతిచెందారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఆర్కే పేటలో రూ.66 లక్షలతో అభివృద్ధి పనులు



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

తిరుత్తణి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్కే పేట యూనియన్‌లో రూ.66 లక్షల వ్యయంతో రోడ్డు, భవనాల మరమ్మతులు సహా పలు అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఆర్కే పేట యూనియన్ సమావేశం యూనియన్ కమిటీ అధ్యక్షురాలు రంజిత భావనన్ అధ్యక్షతన జరిగింది. యూనియన్ కమిషనర్ కళాచెల్వి, ప్రాంతీయ అభివృద్ధి అధికారి సెంథిల్ కుమార్ నాయకత్వం వహించారు. తొలుత యూనియన్ కమిటీ ఉపాధ్యక్షురాలు తిలకవతి స్వాగతం పలికారు. సమావేశంలో యూనియన్ ఆదాయ, వ్యయాలు ప్రవేశపెట్టారు. యూనియన్ పరిధిలోని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు జనరల్ ఫండ్ నుంచి రూ.66.12 లక్షల కేటాయిస్తూ తీర్మానం చేశారు. అలాగే, ఆర్కే పేట సర్కిల్‌లో కొత్త కోర్టు నిర్మాణానికి స్థలం కేటాయించాలని అన్నాడీఎంకే కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే సంతోష్, యూనియన్ కౌన్సిలర్లు గోవిందమ్మాళ్ ఆనందన్, కార్తికేయన్, ఏపీ చంద్రన్, విద్యకరసి శేఖర్ ధనలక్ష్మి కళతీశ్వరన్, ప్రమీలా వెంకటేశన్, అమ్ము శేఖర్, ఉమాపతి, నదియా తిరున్నవం, శివకుమార్, తిరునావుక్కరసు, నరసింహన్, జమున, కుమారస్వామి, అధికారులు పాల్గొన్నారు.

ఏనుగు దాడి మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ ఆలయ ఏనుగు దాడిలో మృతిచెందిన వారి కుటుంబాలకు తలా రూ.2 లక్షల సాయం అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. ఈ నెల 18న ఆలయ ఏనుగు దేవయాని హఠాత్తుగా దాడి చేయడంతో మావటి ఉదయకుమార్, ఆయన బంధువు శిశుపాలన్ మృతిచెందిన విషయం తెలిసిందే. వారి మృతి తనకు దిగ్భ్రాంతికి గురిచేసిందని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు సీఎం తన సంతాప ప్రకటనలో తెలిపారు.

విమానాల సంఖ్య పెంచిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ రాష్ట్రం నుంచి నడిపే విమానాల సంఖ్య పెంచుతున్నట్లు ప్రకటించింది. శీతాకాలం సందర్భంగా ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుందనే ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని చెన్నై, మదురై, తదిరుచ్చి విమానాశ్రయాల నుంచి వారాంతపు విమానాల సంఖ్యను 107 నుంచి 140కి పెంచినట్లు ఆ సంస్థ తెలిపింది.



ప్రముఖ తమిళ కవి సురదా 104వ జయంతి సందర్భంగా చెన్నై అశోక్‌నగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలవేసి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు ఎం.సుబ్రమణ్యం, ఎస్ఎం నాజర్, ఎమ్మెల్యేలు జే.కరుణానిధి, ఏఎంవీ ప్రభాకర్‌రాజా, కే.గణపతి తదితరులు



ప్రమిదలను ఎండలో ఆరబెడుతున్న కుమ్మరి

● కార్తీక దీపోత్సవం

జోరుగా మట్టి ప్రమిదల తయారీ

SUNDAY SPECIAL

(ఆంధ్రజ్యోతి, చెన్నై)

దీపం అనేది త్రిమూర్తి స్వరూపం. దీపంలో మూడు రంగుల కాంతులున్నాయి. ఎర్రని కాంతి బ్రహ్మదేవుడికి, నీలికాంతి మహావిష్ణువుకు, తెల్లని కాంతి పరమేశ్వరుడికి ప్రతీకలని ఐతిహ్యం. ఈ కాంతి కళ్లమీద పడితే నేత్ర దృష్టి మెరుగవుతుంది. ఇంతటి విశేషాలను సంతరించుకున్న, శుభాలను సూచించే దీపాన్ని మట్టి ప్రమిదలతో వెలిగించడం అత్యంత శ్రేష్ఠదాయకం. ఇత్తడి, రాగి, ఇనుము వంటి లోహాలతో తయారైన ప్రమిదలు, చెట్టు బెరడు ప్రమిదలు, అరటి బెరడు ప్రమిదలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నా వీటన్నింటికంటే శ్రేష్ఠమైనవి మట్టి ప్రమిదలేనని పెద్దలు చెబుతారు. అందుకనే ప్రాచీనకాలం నుంచి మట్టి ప్రమిదలతో ఇంటి గుమ్మాల్లో, పూజగదులతో దీపాలను వెలిగించడం ఆనవాయితీ. మట్టి ప్రమిదల్లో నెయ్యి, నువ్వుల నూనెను ఉపయోగించి, మేలైన దూదిని వత్తిగా చేసి వెలిగించడమే భారతీయుల ప్రాచీన సంప్రదాయం. కార్తీక దీపంరోజున మట్టి ప్రమిదలతో దీపాలు వెలిగిస్తే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని చెబుతారు. ప్రమిదల్లో నేతిని నింపి దీప ప్రజ్వలన చేస్తే మహాలక్ష్మి అనుగ్రహం లభిస్తుందని చెబుతారు.





మట్టి ప్రమిదలను వరుసగా పేర్చుతున్న కుమ్మరి - నిప్పుమంటల్లో కాలుతున్న మట్టి ప్రమిదలు

నవగ్రహాల అనుగ్రహం..

ప్రమిద దీపం సూర్యుడికి, నెయ్యి లేదా నూనె చంద్రుడికి, వత్తులు బుధగ్రహానికి, జ్వాల అంగారకుడికి, నేలపై పడే జ్వాల నీడ రాహువుకు, జ్వాలలో పసుపురంగు గురుగ్రహానికి, దీప ప్రజ్వలన వల్ల ఏర్పడే నలుపురంగు శనీశ్వరుడికి, దీపకాంతి కేతువుకు, వత్తులు వెలుగునిస్తూ తరగటం శుక్రుడికి సంకేతాలని చెబుతారు. ఒక మట్టి ప్రమిదతో దీపం వెలిగిస్తే నవగ్రహాల అనుగ్రహం లభిస్తుందని కార్తీక దీపం పండుగను జరుపుకునే ప్రజలంతా భావిస్తున్నారు. ఇంతటి విశేషాలను సంతరించుకున్న మట్టి ప్రమిదలు రాజధాని నగరం రాయపేటలోను, కొసపేటలోనూ కుమ్మరులు తయారు చేస్తుండడటం విశేషం. దీపావళి రోజున కూడా ఈ కుమ్మరులు వేల సంఖ్యలో మట్టి ప్రమిదలు తయారు చేస్తారు. కార్తీక దీపానికి దీపావళి కంటే మూడింతులగా మట్టి ప్రమిదలను వివిధ ఆకృతుల్లో తయారు చేస్తుంటారు. డిసెంబర్ 13న జరుపుకోనున్న కార్తీక దీపమహోత్సవానికి చెన్నైలో పలుచోట్ల ఇంకా కులవృత్తిని విడిచిపెట్టని వంశపారంపర్యంగా మట్టినే నమ్ముకున్న కుమ్మరులు ఈ కార్తీక దీపం మట్టి ప్రమిదలను వేల సంఖ్యలో తయారు చేస్తున్నారు. సాంప్రదాయ కుమ్మరి కుటుంబీకులు వంశపారంపర్యంగా ప్రమిదలు తయారు చేస్తారు.

అందమైన ప్రమిదలు...

ఏడాదిపొడవునా కుండలు, మట్టి పాత్రలు తయారు చేసే వీరంతా దీపావళి, కార్తీకదీపం పర్వదినాలలో ప్రమిదల తయారీ కోసం మట్టిని తీసుకొచ్చి రోజంతా నీటిలో తడిపి, తొక్కి మెతకపరచి బండిచక్రంపై ఆ తడిమట్టిని కుప్పగా పోసి చక్రాన్ని తిప్పి తమ నేర్పును ప్రదర్శించి వివిధ ఆకృతులతో ఈ ప్రమిదలు తయారు చేస్తున్నారు. రోజుకు కనీసం ఐదారు వేల ప్రమిదలు తయారు చేసి వాటిని ఎండలో ఎండబెట్టి నిప్పుతో కాల్చి సిద్ధం చేస్తారు. కుమ్మరులంతా తమ హస్తకళానైపుణ్యం ఉట్టిపడేలా ఈ అందమైన మట్టి ప్రమిదలు తయారు చేస్తున్నారు. ఈ ప్రమిదలను టోకు వ్యాపారులు కొనుగోలు చేసిన నగరమంతటా ఉన్న మార్కెట్లకు తరలిస్తారు. ఈ మట్టి ప్రమిదలు వాటి సైజులను బట్టి ఒక్కొక్కటీ రెండు రూపాయల నుండి రూ.15 ధరలకు విక్రయిస్తున్నారు. ట్రిప్లికేన్, మైలాపూరు, తిరువాన్మియూరు, ఆవడి, అంబత్తూరు, విల్లివాక్కం, వాషర్‌మెన్‌పేట, మనలి, అడయార్, కోయంబేడు, మధురవాయల్, వానగరం, తిరుమళిసై, పూందమల్లి ప్రాంతాల్లో డిసెంబర్ ఒకటి నుండి ఈ మట్టి ప్రమిదల అమ్మకాలు ఊపందుకోనున్నాయి.



మట్టి ప్రమిదలు తయారు చేస్తున్న కుమ్మరి



రూపు దిద్దుకుంటున్న ప్రమిద

సామాజిక దృష్టితో కూడిన చిత్రం

తొల్ తిరుమావళవన్

నవరస కలైకూడమ్ అనే పేరుతో కొత్తగా స్థాపించిన నిర్మాణ సంస్థ నిర్మించిన 'నెంజు పొరుక్కుదిల్లైయే' సినిమా సామాజిక దృష్టికోణంలో నిర్మించారని డీపీఐ అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు తొల్ తిరుమావళవన్ అన్నారు. అరవింద్ రియో, కాళిదాస్ హీరోలుగా, భువనేశ్వరి రమేష్‌బాబు, నిత్యారాజ్ హీరోయిన్లుగా వెండితెరకు పరిచయమవుతున్నారు. ఇతర పాత్రల్లో జేసన్ కౌశి, శశికుమార్ తదితరులు నటించారు. చిత్ర నిర్మాత క్రీస్తుదాస్ ప్రతినాయకుడి పాత్రను పోషించారు. ఎంఎస్ సుదర్శన్ సంగీతం అందించిన ఈ చిత్రానికి కెమెరా అబ్దుల్ కె.రహమాన్. నిర్మాతలు క్రీస్తుదాస్, యోబు శరవణన్, బ్యూలా క్రీస్తుదాస్. ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ రిలీజ్ వేడుక శుక్రవారం చెన్నైలో జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న తిరుమావళవన్ మాట్లాడుతూ... 'టైటిల్ ఎంపికలోనే సామాజిక బాధ్యతను గుర్తు చేస్తోంది. సినిమా తీస్తే సామాజిక సందేశంతో ఉండాలన్న బాధ్యత నేటి యువతలో ఉండటం సంతోషంగా ఉంది. ప్రేమ ప్రతి ఒక్కరిలో ఉంటుంది. ప్రేమ సహజమైనది. ఇది సహజసిద్ధంగా కలుగుతుంది. సమాజంలో మార్పు కోసం ప్రేమ అనే ఆయుధాన్ని ఉపయోగించాలి. ప్రేమను కృత్రిమంగా సృష్టించలేం. ప్రేమ ఎంతటి ప్రభావాన్ని చూపిస్తున్నదే ముఖ్యం. ప్రేమ వివాహాలు చేసుకున్న తర్వాత ఉత్పన్నమయ్యే సమస్యలను కారణంగా చూపి పరువు హత్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటివి పరువు హత్యలు కాదు. కక్షపూరిత గౌరవ హత్యలు. తాము అల్లారుముద్దుగా పెంచుకున్న పిల్లలను హత్య చేయడమంటే కిరాతక చర్యతో సమానం. పరువు హత్యలు, శిశు హత్యలు మన దేశంలోనే ఎక్కువ. ఈ రెండింటిని నిర్మూలించాలి. లింగవివక్ష లేకుండా సమాన హక్కులు కల్పించినపుడే ఈ పరిస్థితి మారుతుంది. ఇప్పటివరకు అనేక సినిమాలు వచ్చాయి. భవిష్యత్తులో వచ్చే సినిమాలు కూడా ఈ సందేశాన్ని ఇచ్చేలా ఉండాలి. ప్రేమను అంగీకరించలేకపోవడానికి ప్రధాన కారణం మన సామాజిక నిర్మాణమే. మనకు ఇష్టం లేకపోయినా మనపై కులముద్ర వేస్తున్నారు. సమాజంలో ఎదురయ్యే తీవ్రమైన ఒత్తిడి కారణంగానే ప్రేమను నేరంగా పరిగణిస్తున్నారు. ఇందులో స్త్రీ బాధితురాలిగా మారిపోతుంది. ఇలాంటి విషయాలన్నీ సినిమాల్లో ఎత్తి చూపాలి. చిత్రరంగంలోకి ప్రగతిశీల ఆలోచనపరులు రావాలి. ఒక మంచి చిత్రాన్ని నిర్మించిన నిర్మాతలకు శుభాకాంక్షలు' అన్నారు. ఆ తర్వాత నిర్మాతలు, హీరో హీరోయిన్లు, యూనిట్ సభ్యులు ప్రసంగించారు.



నెంజు పొరుక్కుదిల్లైయే ఆడియో రిలీజ్ దృశ్యం

నయినార్ నాగేంద్రన్‌తో ఎస్పీ వేలుమణి భేటీ

బీజేపీతో పొత్తు కోసమేనా?

చెన్నై, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరునెల్వేలిలో అన్నాడీఎంకే సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి బీజేపీ శాసనసభాపక్ష నాయకుడు నయినార్ నాగేంద్రన్‌ను ఆకస్మికంగా కలుసుకోవడం రాజకీయ చర్చకు దారితీసింది. శాసనసభ ఎన్నికల్లో బీజేపీతో పొత్తుపెట్టుకునేందుకే వీరిరువురూ కలుసుకున్నారని ప్రసారమాధ్యమాల్లో ఊహాగానాలు వెలువడ్డాయి. శుక్రవారం తిరునెల్వేలిలో పార్టీ నిర్వాహకుల సమావేశంలో వేలుమణి పాల్గొన్నారు. ఆ సమావేశం ముగిసిన తర్వాత పార్టీ స్థానిక నాయకులతో కలిసి పెరుమాళ్‌పురంలో ఉన్న బీజేపీ శాసనసభాపక్ష నాయకుడు నయినార్ నాగేంద్రన్ నివాసానికి వెళ్లారు. ఆ సమయంలో వేలుమణిని నాగేంద్రన్ సాదరంగా ఆహ్వానించారు. అన్నాడీఎంకే రంగులున్న శాలువను కప్పి సత్కరించారు. సుమారు అరగంటసేపు ఇరువురూ సమావేశమయ్యారు. ఆ తర్వాత వేలుమణి తన ఇంటి వివాహ వేడుకల ఆహ్వానపత్రికను నాగేంద్రన్‌కు అందజేశారు. ఆ తర్వాత పార్టీ నాయకులతో కలిసి వేలుమణి అక్కడి నుండి బయలుదేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో పొత్తుపెట్టుకునే ప్రసక్తే లేదంటూ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పదేపదే ప్రకటనలు చేస్తున్న నేపథ్యంలో వేలుమణి బీజేపీతో పొత్తుపెట్టుకునే విషయమై చర్చించినట్టు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో వేలుమణి విలేకరులతో మాట్లాడుతూ.. నయినార్ నాగేంద్రన్, తాను చిరకాల స్నేహితులమని, పార్టీలు వేరైనా తామిరువురమూ కలుసుకుంటూనే ఉంటామని, ప్రస్తుతం తన ఇంట పెళ్లి వేడుకల ఆహ్వాన పత్రికను ఇచ్చేందుకు వెళ్లానని వివరించారు. తమ భేటీకి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యం లేదని వేలుమణి స్పష్టం చేశారు.



వేలుమణిని నవ్వుతూ ఆహ్వానిస్తున్న నయినార్ నాగేంద్రన్

నా బ్యూటీ సీక్రెట్ అదే

● హన్సిక మొత్వానీ

వయసు పెరిగేకొద్దీ మరింత అందంగా తయారవుతున్న హీరోయిన్లలో హన్సిక మొత్వానీ ఒకరు. 2011లో వచ్చిన ధనుష్ 'మాప్పిళ్లై' ద్వారా కోలీవుడ్‌లో అడుగుపెట్టిన ఈ బ్యూటీకి తొలి చిత్రమే బాక్సాఫీస్ హిట్ సాధించింది. ఆ తర్వాత 'ఎంగేయుం కాదల్', 'వేలాయుధం', 'ఒరు కాదల్ ఒరు కన్నాడి', 'తీయా వేలై సెయ్యనుం కుమారు', 'సింగం-2', 'అన్నామలై' వంటి వరుస హిట్ మూవీల్లో నటించి తమిళ ప్రేక్షకుల మనసుల్లో జూనియర్ ఖుష్బూగా చెరగని ముద్ర వేసుకున్నారు. మహారాష్ట్రలోని సింధ్ కుటుంబానికి చెందిన హన్సిక... తన కెరీర్‌ను 2001లోనే ప్రారంభించారు. అలా ఇండస్ట్రీలోకి ప్రవేశించి తనకంటూ ఓ స్థానాన్ని, గుర్తింపును సొంతం చేసుకున్న ఈ ముద్దుగుమ్మ... వయసు మీదపడుతున్నా తన అందం, అభినయంతో అభిమానులను అలరిస్తున్నారు. ఈ నేపథ్యంలో తన బ్యూటీ సీక్రెట్‌తో పాటు పాన్ ఇండియా సినిమా, తదితర అంశాలపై తన అభిప్రాయాలను తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.



హన్సిక మొత్వానీ



? మీ బ్యూటీకి కారణం

! కెరీర్ మొదలుపెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆదరిస్తున్న నా అభిమానుల మద్దతే నా శక్తి, బలం. వారి ప్రేమ, ఆదరాభిమానాలే నన్ను మరింత అందంగా తీర్చిదిద్దుతున్నాయి. ఇదే నా బ్యూటీ సీక్రెట్.

? పాన్ ఇండియా సినిమాలపై అభిప్రాయం

! తమిళం, తెలుగు, కన్నడ భాషల్లో అధిక సంఖ్యలో ఈ తరహా సినిమాలు వస్తున్నాయి. మన వద్ద అబ్బురపరిచే సాంకేతిక టెక్నాలజీ, ఎంతోమంది ప్రతిభావంతులైన కళాకారులు ఉన్నారనే విషయాన్ని రుజువు చేస్తున్నాయి.

? జూనియర్ ఖుష్బూగా మీరు నేర్చుకున్నది

! అలా పిలవడం సంతోషంగానే ఉంది. తమిళ సినీ అభిమానులకు ఒక నటి నచ్చిందంటే చాలు.. వారికి వీరాభిమానులుగా మారిపోతారు. వారి నుంచి 'అన్ కండీషనల్ లవ్'ను నేను నేర్చుకున్నాను. ఎన్నటికీ తమిళ ఫ్యాన్స్ నాకు ఓ ప్రత్యేకం.

? అలాంటి పాత్రల్లో హన్సికను మళ్లీ చూస్తామా

! ఎంగేయుం కాదల్, రోమియో జూలియట్ వంటి చిత్రాల్లో నా నటనకు ఫ్యాన్స్ ఫిదా అయ్యారు. ఈ సినిమాల తర్వాత వారు చూపిన ప్రేమ మరిచిపోలేనిది. ఇలాంటి సినిమాల్లో మళ్లీ నటించాలని వారు కోరుకోవడంలో తప్పులేదు. ఇపుడు అనేక చిత్రాల్లో నటిస్తున్నాను.

? అభిమానులకు మీరిచ్చే సలహా

! ప్రతి అభిమానీ ఇతరుల పట్ల ప్రేమాభిమానాలు చూపుతూ సత్ప్రవర్తనతో నడుచుకోవాలి.

చిత్రజ్యోతి

పెళ్లి చేసుకునే ఉద్దేశం లేదు

ఐశ్వర్య లక్ష్మి



ఐశ్వర్య లక్ష్మి

పలువురు సినీ సెలబ్రిటీల వైవాహిక జీవితాల్లో వెలుగు చూస్తున్న చేదు సంఘటనలు చూసిన తర్వాత తనకు పెళ్లి చేసుకోవాలన్న ఆలోచనే లేకుండా పోయిందని హీరోయిన్ ఐశ్వర్య లక్ష్మి స్పష్టం చేశారు. కోలీవుడ్‌లోని యంగ్ హీరోయిన్లలో ఒకరిగా గుర్తింపు పొందిన ఈ మలయాళ భామ.. మణిరత్నం 'పొన్నియిన్ సెల్వం' మూవీలో పూంగుళిగా ప్రేక్షకుల మనస్సుల్లో సుస్థిర స్థానాన్ని దక్కించుకున్నారు. ప్రస్తుతం మలయాళంలో 'హలో మమ్మీ' అనే చిత్రంతో పాటు తమిళం, తెలుగు భాషా చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో తాజాగా ఆమె ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో పెళ్లి అంశంపై స్పందించారు. 'చిన్న వయసులో పెళ్లి చేసుకుని, భర్త, పిల్లలతో హాయిగా జీవితం గడపాలన్న ఆలోచన ఉండేది. కాలక్రమంలో అనేక మంది చిన్నారులను, సినీ సెలబ్రిటీల వైవాహిక జీవితాలు చిన్నాభిన్నం కావడం చూసి వివాహం చేసుకోవాలనే ఆశ చనిపోయింది. సంతోషం లేని అనేక మంది జీవితాల అంతిమ నిర్ణయం చూసి విరక్తి కలిగింది. అందుకే నాకు పెళ్లి చేసుకోవాలన్న ఆలోచనే లేకుండా పోయింది' అని పేర్కొన్నారు.

26న 'విడుదలై-2' ఆడియో విడుదల

వెట్రిమారన్ దర్శకత్వంలో సూరి, విజయ్ సేతుపతి ప్రధాన పాత్రలను పోషించిన తాజా చిత్రాం 'విడుదలై-2'. గత యేడాది మార్చి 31న విడుదలైన హిట్ మూవీ 'విడుదలై'కు సీక్వెల్. రెండో భాగంలో హీరోయిన్‌గా మలయాళ నటి మంజు వారియర్ నటించారు. ఇతర పాత్రల్లో భవానీశ్రీ, ప్రకాష్‌రాజ్, గౌతం వాసుదేవ్ మేనన్, రాజీవ్ మేనన్, సేత్తన్ తదితరులు నటించారు. 'ఇసెజ్ఞాని' ఇళయరాజా సంగీత స్వరాలు సమకూర్చగా, వేల్‌రాజ్ ఛాయాగ్రహణం అందించారు. తొలి భాగంలో హీరో సూరి పోషించిన పాత్రకు ప్రాధాన్యం కల్పిస్తూనే, విజయ్ సేతుపతి పాత్రకు సంబంధించిన బ్యాక్‌గ్రౌండ్‌ను వివరించే విధంగా రెండో భాగాన్ని రూపొందించారు. వచ్చే నెల 20న విడుదల చేయనున్నట్టు ఇప్పటికే దర్శక నిర్మాతలు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఈ చిత్రం ఆడియో, ట్రైలర్‌ను ఈ నెల 26న విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. కాగా, ఈ చిత్రం నుంచి 'దినం దినముం' అనే పేరుతో సాగే తొలి సింగిల్‌ను ఇప్పటివరకు విడుదల చేయగా, శ్రోతల నుంచి మంచి స్పందన వచ్చింది.



'విడుదలై-2'లో విజయ్ సేతుపతి - మంజు వారియర్

బాస్కెట్‌బాల్ ఆసియా కప్ క్వాలిఫయర్ మ్యాచ్ విజేత ఖతర్



చెన్నై, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బాస్కెట్‌బాల్ 'ఫిబా ఆసియా కప్' క్వాలిఫయర్‌లో భారత జట్టు ఖతర్ చేతిలో పరాజయం పాలైంది. స్థానిక నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఆసియా కప్ సిరీస్ జరుగుతున్న విషయం తెలిసిందే. శుక్రవారం రాత్రి ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 76వ స్థానంలో వున్న భారత జట్టు, 101వ ర్యాంకింగ్స్‌లో వున్న ఖతర్ జట్టుతో తలపడి విజయం ముంగిట బోల్తాపడింది. భారత జట్టు కెప్టెన్ హఫీజ్ వరుగా 3 కౌంట్లు తీసుకుని జట్టును బలోపేతం చేసినా విజయాన్ని సొంతం చేసుకోలేకపోయారు. చివరికి 69-53 స్కోరుతో ఖతర్ జట్టు అద్భుతమైన విజయాన్ని నమోదు చేసింది.

మహిళా ఉపాధిలో రాష్ట్రం ముందంజ

● మంత్రి టీఆర్‌బీ రాజా

చెన్నై, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళా ఉపాధిలో తమిళనాడు ముందంజలో వుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా పేర్కొన్నారు. మ్యాట్రిమోనీ డాట్ కాం గ్రూపునకు చెందిన 'మెనీజాబ్స్' యాప్‌ను నగరంలో శుక్రవారం లాంఛనంగా ఆవిష్కరించిన మంత్రి మాట్లాడుతూ.. తమిళనాడు ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆంగ్లంతో పాటు తమిళంలోనూ ఉద్యోగ పోర్టల్‌ను రూపొందించినందుకు నిర్వాహకులను అభినందించారు. ఈ యాప్ రాష్ట్రంలో ఉపాధి రేటును పెంచడానికి దోహదం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మ్యాట్రిమోనీ డాట్ కాం గ్రూప్ సీఈవో మురుగవేల్ జానకిరామన్ మాట్లాడుతూ.. తమిళనాడులో ఫ్రంట్‌లైన్, ఎంట్రీ-లెవల్ ఉద్యోగావకాశాల కోసం ప్రత్యేకంగా ఈ యాప్‌ను రూపొందించినట్టు తెలిపారు.



యాప్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి టీఆర్‌బీ రాజా

క్యారమ్స్ క్రీడాకారిణి కాసిమాకు ప్రశంస



కాసిమాను సత్కరిస్తున్న సెల్వపెరుందగై, కౌన్సిలర్ ద్రవ్యం తదితరులు

ప్యారీస్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో జరిగిన అంతర్జాతీయ క్యారమ్స్ పోటీలో బంగారు పతకం సాధించిన ఉత్తర చెన్నైకి చెందిన క్రీడాకారిణి కాసిమాను స్థానిక వాషర్‌మెన్‌పేటలో ఉత్తర చెన్నై కాంగ్రెస్ తరపున ఘనంగా అభినందించి రూ.లక్ష నగదు అందజేశారు. వాషర్‌మెన్‌పేటలో ఆటో డ్రైవర్‌గా ఉన్న మహబూబ్ బాషా కుమార్తె కాసిమా అంతర్జాతీయ స్థాయి క్యారమ్స్ పోటీల్లో బంగారు పతకం సాధించి రాష్ట్రానికి, దేశానికి ఘనత చేకూర్చిన సందర్భంగా శనివారం ఉదయం ఏర్పాటైన అభినందన సభలో టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై, పొన్నేరి కాంగ్రెస్ ఎమ్మెల్యే దురై చంద్రశేఖర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, కౌన్సిలర్ ఎంఎస్ ద్రవ్యం తదితరులు పాల్గొన్నారు.




సదస్సులో వైద్య నిపుణులు

సిమట్స్‌లో నర్సింగ్‌పై సదస్సు

చెన్నై, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సవీత కాలేజ్ ఆఫ్ నర్సింగ్, సవీత ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెస్ (సిమట్స్), అసోసియేషన్ ఆఫ్ నర్స్ ఎగ్జిక్యూటివ్స్ ఇండియా తమిళనాడు విభాగం సంయుక్త ఆధ్వర్యంలో 'ఇన్నోవేషన్ ఇన్ క్లినికల్ నర్సింగ్-ఎ రోడ్ మ్యాప్ ఫర్ ది ఫ్యూచర్' అనే అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. శనివారం వైద్య నిపుణులు, 210 మంది ప్రతినిధులు పాల్గొన్న ఈ సదస్సుకు సిమట్స్ ఛాన్స్‌లర్ డాక్టర్ ఎన్ఎం వీరయ్యన్ అధ్యక్షత వహించగా, డాక్టర్ లాలూ జోసెఫ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నర్సింగ్ ప్రాక్టీస్‌లో ఆవిష్కరణల ప్రాధాన్యాన్ని ఈ సందర్భంగా డాక్టర్ లాలూ జోసెఫ్ నొక్కి చెప్పారు.







నేలపట్టు పక్షుల పురిటిల్లు

ప్రత్యేక కథనం దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి

పెళ్లయ్యాక మెట్టినింటికి వెళ్లిపోయిన ఆడపిల్లలు, పురిటి కోసం మాత్రం పుట్టింటికి చేరుకోవడం ఆనవాయితీ. పక్షులు కూడా ఈ ఆనవాయితీని పాటిస్తాయని తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలంలోని నేలపట్టు నిరూపిస్తోంది. సైబీరియా, దక్షిణ అమెరికా, ఆస్ట్రేలియా, శ్రీలంక, బర్మా, ఇంగ్లండ్, హిమాలయాలు.. దూరాలతో పనిలేదు. జీపీఎస్‌తో పనిలేదు. రెక్కల కష్టమనే వెరపు ఉండదు. ఎగురుకుంటూ ఎగురుకుంటూ నవంబరు నెలకల్లా నేలపట్టుకు చేరుకుంటాయి. పుల్లాపుచికా, గడ్డీగాదం ఏరుకొచ్చి గూళ్లు కట్టుకుంటాయి. గుడ్లు పెట్టి పొదుగుతాయి. పులికాట్ సరస్సులోనూ, పరిసరాల్లోని చెరువులూ, నీటి చెలమలూ, వరికయ్యల్లోనూ నత్తలూ, ఎండ్రకాయలూ, కప్పలూ, చేపలూ, రొయ్యలూ వేటాడి తెచ్చి పిల్లలకు గోరుముద్దలు చేసి తినిపిస్తాయి. రెక్కలు అమిరి ఎగరగలవని నమ్మకం కుదిరాక తిరుగు ప్రయాణం మొదలు పెడతాయి. ఫిబ్రవరి నుంచి మే నెల దాకా వెనక్కి వలస సాగుతుంది. మళ్లీ వేల కిలోమీటర్లు ఎగిరి వెళ్లిపోతాయి. ఇక్కడ పుట్టిన పిల్లలు ఎక్కడెక్కడో పెరిగి పెద్దయినా, పుట్టింటిని గుర్తు పెట్టుకుని మళ్లీ ఏడాదికంతా నేలపట్టును వెతుక్కుంటూ వస్తాయి. ఏటా దాదాపు 8నుంచి 9 వేల పక్షులు నేలపట్టు విడిదికి చేరుకుంటాయి. గత ఏడాది 8286 పక్షులు రాగా, ఈ ఏడాది ఇప్పటికే 7813 పక్షులు నేలపట్టులో రెక్కలు రెపరెపలాడిస్తున్నాయి. తెల్లని పక్షులు వాలిన పచ్చని చెట్లతో కూడిన నేలపట్టు అందాలను ఆస్వాదించడానికి పర్యాటకులు ఈ సీజన్‌లో పెద్ద సంఖ్యలోనే వస్తున్నారు.

నేలపట్టు రారాజు



పెలికాన్

నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో భారీకాయంగల పక్షి పెలికాన్. దాదాపు 15 కిలోల దాకా బరువుంటుంది. దీనిని గూడ బాతు, గూడకొంగ అని స్థానికంగా అంటారు. నేలపట్టులో గ్రే పెలికాన్స్ (ముదుర బూడిద రంగు) పక్షులు ఎక్కువగా విడిది చేస్తాయి. 4 అడుగుల పొడవుతో ఉండే పెలికాన్ రెక్కలు 6 నుండి 7 అడుగుల నిడివి కలిగి ఉంటాయి. మెడ కింద భాగంలో 4 అడుగుల సంచి లాంటిది ఉంటుంది. ఉదయాన్నే లేచి పులికాట్ సరస్సులో వేటకు వెళ్తుంది. 5 కిలోల దాకా బరువుండే చేపలు, పీతలు, కప్పలు వేటాడి మెడకింది సంచిలో వేసుకుని సాయంత్రానికి గూటికి చేరుతుంది. నేలపట్టు చెరువులోని కడప చెట్లమీద గూడు కట్టుకుని రెండు,మూడు గుడ్లు పెడుతుంది. ఆడపక్షి గూటిలో ఉంటే మగపక్షి వేటకు వెళ్తుంది. 30 రోజులపాటు పొదుగుతుంది. పిగిలిన పిల్లల్ని 12 నెలల పాటు పెంచి, రెక్కలొచ్చాక వాటితో కలిసి మరో ప్రాంతానికి వలసపోతుంది. అక్టోబరు చివరలో పెలికాన్‌ల రాకడ మొదలవుతుంది. శ్రీలంక, బర్మా, ఆస్ట్రేలియాల నుంచీ, హిమాలయ ప్రాంతాల నుంచీ పెలికాన్‌లు ప్రతి ఏటా నేలపట్టుకు వలస వస్తాయి. పెలికాన్ జీవిత కాలం పదేళ్లు.

ఇప్పటికే చేరుకున్న పెలికాన్‌ల సంఖ్య: 1316
గత ఏడాది వచ్చినవి: 1014

తొలి అతిథి



నత్తగుల్ల కొంగ

విదేశీ విహంగాల్లో మొదటిగా వచ్చే పక్షి ఓపన్ బిల్ స్టార్క్స్. దీనిని నత్తగుల్లకొంగ అంటారు గోధుమ రంగులో నిగ నిగలాడుతూ ఉండే ఈ పక్షి, సంతానోత్పత్తి తరువాత తెలుపు రంగులోకి మారడం విశేషం. రెండు నుండి మూడు గుడ్లు పెట్టి పొదుగు తుంది. నేలపట్టులోనే సంతానోత్పత్తి చేస్తుంది. ఇవి రైతు నేస్తాలు కూడా. వరి పొలాల్లో సంచరించి చీడపీడలను తినేస్తాయి. దాంతో తెగుళ్ళ బెడద తగ్గుతుంది.

ఇప్పటికే చేరుకున్న సంఖ్య : 1964
గత ఏడాది వచ్చినవి : 3116

గుంపులుగా పొదిగే పక్షి



తెల్లకంకణాయి

దక్షిణ అమెరికా, వెస్టిండీస్ దేశాల నుంచి అక్టోబరు నెలాఖరు రోజుల్లో నేలపట్టుకు చేరుకున్న పక్షి తెల్లకంకణాయి (వైట్ ఐబీస్). ఏప్రిల్ మొదటి వారం వరకు ఇక్కడే ఉంటాయి. చెరువులోని చెట్ల మీద గుంపులుగా పొదుగుతాయి. ఒక పక్షి రెండు నుంచి ఐదు గుడ్లు పెడుతుంది. చేపలు, కప్పలు, కీటకాలను ఆహారంగా స్వీకరిస్తుంది.

ఇప్పటికే చేరుకున్న సంఖ్య : 2458
గత ఏడాది వచ్చినవి : 1274

ఇంగ్లండ్ మిత్రులు



చిన్నస్వాతికొంగలు

ఆసియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ దేశాల్లో ఎక్కువగా నివశించే చిన్నస్వాతికొంగలు (లిటిల్ ఎగ్రేట్స్) నేలపట్టులో అరుదుగా మాత్రమే తారసపడుతుంటాయి. 1994 నుండి మాత్రమే ఇవి నేలపట్టుకు వస్తున్నాయి. లోతు లేని నీళ్లల్లో ఆహారం సేకరణ చేస్తుంది. చిన్న జీవులను తింటుంది. 3 - 5 వాటి గుడ్లు నీలం, ఆకుపచ్చ రంగులో ఉంటాయి. 3 నుంచి 5 గుడ్లను ఒక పక్షి పెడుతుంది. మూడు వారాలు పాటు పొదిగి, ఆరు వారాల పాటు పిల్లను పెంచి వాటితో కలిసి ఎగిరి వెళ్లిపోతుంది.

ఇప్పటికే చేరుకున్న సంఖ్య: 1686, గత ఏడాది వచ్చినవి: 1562

వెదురుపట్టు స్నేహితులు





ఎర్రకాళ్ల కొంగలు

నేలపట్టుకు సమీపంలోని వెదురుపట్టు నర్సమాంబపుర అగ్రహారంలో ఈ అరుదైన ఎర్రకాళ్ళ కొంగలు (పెయింటెడ్ స్టార్క్స్) విడిది చేస్తాయి. హిమాలయాల్లోనూ, దక్షిణాసియాలోనూ కనిపించే ఈ పక్షులు డిసెంబరులో ఇక్కడికి చేరుకుంటాయి. ఇళ్ల మధ్య ఉండే చింతచెట్ల మీదే వీటి ఆవాసం. పగలంతా పులికాట్ సరస్సులోని శ్రీహరికోట, కొండూరు పాళెం, రాయదొరవు, ఇరకం, పేర్నాడు ప్రాంతాల్లో వేట సాగించి, సాయంత్రానికి వెదురుపట్టుకు చేరుకుంటాయి. చేపలను, పీతలు, రొయ్యలు ఆహారంగా తీసుకుంటాయి. వీటి విసర్జితంతో చెట్లకింద దిబ్బలు పేరుకుంటాయి. ఇది పొలాలకు ఎరువుగా వాడుకుంటారు. స్థానిక ప్రజలతో ఎంతో స్నేహంగా సన్నిహితంగా మెలుగుతాయి. వెదురుపట్టు ప్రజలు వీటి రక్షకులుగా ఉంటారు. ఫిబ్రవరి నుంచి గుడ్లు పొదిగి సంతానోత్పత్తి చేస్తాయి. మే నెలదాకా పిల్లల్ని పెంచి, వెంటతీసుకుని వెళ్లిపోతాయి.

శ్రీలంక నుంచి వచ్చే



చిన్న నీటి కాకులు

నేలపట్టులో చాలా పెద్ద శ్రీలంక నుండి వచ్చే పక్షి లిటిల్ కార్మోరెంట్స్. శరీరం నల్లగా, ఈకలు గోధుమ రంగులో ఉంటాయి. ఒంటరిగా నీటిలో మునుగుతూ ఆహార అన్వేషణ చేస్తుంది. ఒక మీటర్ లోతున్న నీటిలో మాత్రమే ఆహార అన్వేషణ చేస్తుంది. నవంబరు నుండి ఫిబ్రవరి వరకు ఈ జాతి పక్షులు ఇక్కడ సంచరిస్తాయి. ఇక్కడే గుడ్లు పెట్టి పొదిగి పిల్లలతో కలిసి వెళ్లిపోతాయి.

ఇప్పటికే చేరుకున్న సంఖ్య : 41
గత ఏడాది వచ్చినవి : 301

రాత్రి వేటగాడు



శబరి కొంగ

గ్రీకు జాతికి చెందిన నైట్ హెరాన్స్ ను నేలపట్టులో శబరికొంగ అని పిలుస్తారు. పొట్టి మెడ, పొట్టి కాళ్ళు, బూడిద రంగు శరీరం పైన నలుపు కిరీటం గల పక్షి ఇది. రాత్రి వేళ్ళలో వేట సాగిస్తుంది. చిన్న చేపలు, కప్పలు, జలకీటకాలను తింటుంది. పగటి పూట చెట్లు, పొదల్లో విశ్రాంతి తీసుకొంటుంది. 3 నుండి 8 గుడ్లు పెడుతుంది. ఆగ్నేయ ఐరోపా నుంచి ఎగిరి వచ్చి, గుడ్లు పెట్టి, .పొదిగి పిల్లలతో వెళ్లిపోతుంది.

ఇప్పటికే చేరుకున్న సంఖ్య : 68
గత ఏడాది వచ్చినవి : 593

అరుదైన గెస్ట్



తెడ్డుముక్కు కొంగ

నేలపట్టుకు అరుదైన వలస పక్షి ఇది. నలుపు, పసుపు రంగుల కలిగిన గరిటిలాంటి(స్పూన్ ఆకారంలో) ముక్కు ఉంటుంది. సంతానోత్పత్తి కోసమే నేలపట్టుకు వస్తుంది. రెండు గుడ్లు పెడుతుంది. మంచి నీరు, పులికాట్‌తో పాటు, చెక్ డ్యామ్‌లు, చిత్తడి పొలాల్లో వేట సాగిస్తుంది. చేపలు, రొయ్యలు ఎక్కువగా స్వీకరిస్తుంది. తక్కువ లోతుండే పులికాట్‌లో వీటికి అనువైన ఆహారం లభిస్తుడంతోనే ఇక్కడికి ఏటా పెద్ద సంఖ్యలో వస్తున్నాయి.

ఇప్పటికే చేరుకున్న సంఖ్య : 82 , గత ఏడాది వచ్చినవి : 26

నేలపట్టు విడిదికి చేరుకున్న మరికొన్ని పక్షులు...

లార్జ్ ఎగ్రేట్స్(పెద్దస్వాతి కొంగలు) 10, పాండ్ హెరాన్స్(గుడ్డి కొంగలు) 35, .క్యాటిల్ ఎగ్రేట్స్ (పశువుల కొంగలు) 68, ఇండియన్ మోర్ హెరాన్స్(జమ్ముకోళ్ళు) 14, స్పాట్ బిల్ డక్స్ (చుక్కమూతి బాతులు) 10, డాబ్ చిక్స్ (బుడగ బాతులు) 13, కూట్స్(చుక్కకోళ్ళు)12, ఫర్పుల్ మోరోహెన్స్(చెంచుకోడి)6, విజిలింగ్ డక్స్(ఈల వేసే చిలువలు) 30 ఉన్నాయి.



తిరుపతి వైసీపీలో టీడీఆర్ టెర్రర్

- తుడా అధికారులతో కలసి విజిలెన్సు క్షేత్రస్థాయి తనిఖీలు
- నాలుగు మాస్టర్ ప్లాన్ రోడ్లలో ముగిసిన పరిశీలన
- వెలుగుచూడనున్న కోట్లాది రూపాయల అవినీతి



విజిలెన్సు అధికారులు తనిఖీ చేస్తున్న కొంకా చెన్నాయి గుంట రోడ్డు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో తిమ్మిని బమ్మిని చేసి టీడీఆర్ బాండ్ల కుంభకోణానికి పాల్పడిన సూత్రధారులు, పాత్రధారుల గుట్టు బయటకు రానుంది.దీంతో తిరుపతి వైసీపీ నేతల్లో ఆందోళన మొదలైంది. తిరుపతి నగర పాలక సంస్థలో టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్మెంట్ రైట్స్) బాండ్ల కుంభకోణం డొంక వేగంగా కదులుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారాన్ని చేతిలోకి తీసుకుని తిరుపతిలో అడ్డగోలుగా ఏర్పాటు చేసిన 21 కొత్త, ఏడు పాత మాస్టర్ ప్లాన్ రోడ్లలో జరిగిన రూ.కోట్లాది అవినీతిపై నిగ్గు తేల్చడానికి జిల్లా విజిలెన్సు విభాగం రంగంలోకి దిగింది. తుడా అధికారులతో కలసి క్షేత్రస్థాయి విచారణ మొదలుపెట్టింది. మాస్టర్ ప్లాన్ రోడ్లకు సంబంధించి ఇప్పటివరకు దాదాపు 400కు పైగా టీడీఆర్ బాండ్లు జారీ చేశారు.ఈ నేపథ్యంలో రూ.4వేల కోట్ల కుంభకోణం జరిగిందని టీడీపీ నేత ఆనం వెంకటరమణారెడ్డి గతంలో ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనిపై విజిలెన్సు డీజీపీ విచారణకు ఆదేశించారు. గత 10 రోజులుగా జిల్లా విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు, తుడా ఇంజనీరింగ్, సర్వే అధికారులు, విజిలెన్సు సిబ్బంది క్షేత్ర స్థాయిలో రంగంలోకి దిగి విచారణ సాగిస్తున్నారు. ఇప్పటికి నాలుగు రోడ్లలో తనిఖీలు ముగియగా.. పెద్దఎత్తున అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నట్లు వెలుగులోకి వస్తోంది. ఒక్కో రోడ్డులో కనీసం రూ.రెండు కోట్ల నుంచి రూ.మూడు కోట్ల వరకు సగటున అవినీతి చోటు చేసుకుని ప్రజా ధనం విచ్చలవిడిగా మట్టిపాలు చేశారని విచారణలో తేలింది. పెద్దఎత్తున కోట్లాది రూపాయలు అవినీతి జరిగి ఉంటుందని విజిలెన్సు అధికారులు అంచనా వేస్తున్నారు. టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై పూర్తిస్థాయిలో నిగ్గు తేల్చి త్వరలోనే ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందచేస్తామని విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ చెప్పారు.

అవినీతి జరిగిందిలా..

వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతిలో చేపట్టిన చేసిన 21 కొత్త, ఏడు పాత మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులు ప్రణాళికా బద్ధంగా, రోడ్డు డెవలప్మెంటు ప్లాన్ ఆమోదం మేరకు జరగలేదన్న విమర్శలు ఉన్నాయి. ఒక్కోచోట ఒక్కో విధంగా, స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు ప్రజా ప్రతినిధులు, కార్పొరేషన్ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు కూడ బలుక్కుని రూ.కోట్లలో దోచేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా ఇప్పటి వరకు విచారణ చేసిన నాలుగు మాస్టర్ ప్లాన్ రోడ్లు అడ్డగోలుగా ఏర్పాటు చేసుకున్నట్లు తేలిందని విచారణ అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా మాస్టర్ ప్లాన్ రోడ్ల ఏర్పాటులో తిరుపతి అర్బన్ సబ్ రిజిస్ట్రార్ వద్ద ఉన్న మార్కెట్ ధర కంటే ఎక్కువగా భూమి విలువ పెంచి, తదనుకుణంగా టీడీఆర్ బాండ్లు జారీచేసినట్టు తెలుస్తోంది. అలాగే ఖాళీ స్థలానికి కూడా మార్కెట్ ధర కంటే ఎక్కువగా వాణిజ్య భూములను చూపించి మార్కెట్ విలువ కంటే పది రెట్లు ఎక్కువ ధరకు టీడీఆర్ బాండ్లు పంపిణీ చేశారు. టీడీఆర్ బాండ్లలో సూచించిన కొలతలకు క్షేత్ర స్థాయిలో ఉన్న కొలతల మధ్య రోడ్డు వెడల్పు, పొడవులో చాలా తేడాలున్నట్లు విజిలెన్సు అధికారులు గుర్తించారు. ప్రతి రోడ్డు వెడల్పు, పొడవు కొలిచి ప్రతిపాదనల్లో సూచించిన కొలతలు, రోడ్లు వేసిన కొలతలు పరిశీలించి నివేదికను విజిలెన్సు ఎస్పీకి సమర్పిస్తున్నారు. ఇందులో ఇద్దరు మాజీ ప్రజా ప్రతినిధులు, టౌన్ ప్లానింగ్ అధికారుల పాత్ర ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మరో నెల రోజుల వ్యవధిలో మొత్తం రోడ్లు తనిఖీ చేసి అవినీతి అక్రమాలపై సమగ్ర నివేదిక అందచేయనున్నారు.

తనిఖీలు పూర్తి చేసిన రోడ్లు ఇవీ

- అక్కారంపల్లి 40 అడుగుల రోడ్డు అరకిలోమీటరు వరకు కొత్తగా ఏర్పాటు చేశారు. దీనికోసం 25 టీడీఆర్ బాండ్లు విడుదల చేశారు.
- 1.2 కిలోమీటర్ల పొడవుతో రోడ్డు డెవలప్మెంటు కింద రేణిగుంట రోడ్డు ఆయిల్ మిల్లు నుంచి స్టేడియం వరకు ఏర్పాటు చేసిన మాస్టర్ ప్లాన్ రోడ్డు కోసం 62 టీడీఆర్ బాండ్లు విడుదల చేశారు.
- కొంకా చెన్నాయగుంట 100 అడుగుల రోడ్డు 1.29 కిలోమీటర్ల పొడవుతో ఏర్పాటు చేసిన ఈ రోడ్డులో 13 టీడీఆర్ బాండ్లు పంపిణీ చేశారు.
- 150 మీటర్ల పొడవుతో ఏర్పాటు చేసిన మానస సరోవర్ 40 అడుగుల రోడ్డులో రెండు బాండ్లు పంపిణీ చేశారు. ఇందులో మొత్తం 102 టీడీఆర్ బాండ్లు విడుదల చేశారు.

వేటగాళ్ల కరెంటు ఉచ్చు

- తీగలకు తగిలి గజరాజు మృతి
- దేపట్లవారిపల్లె సమీపంలో ఘటన



ఏనుగు కళేబరాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో, సీసీఎఫ్



మృతి చెందిన మగ ఏనుగు

భాకరాపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అడవి పందుల కోసం వేటగాళ్ల లాగిన కరెంటు తీగలకు తగిలి గజరాజు మృతి చెందింది. ఈ ఘటన చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట పంచాయతీ దేపట్లవారిపల్లె సమీపంలోని మామిడి తోటలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. డీఎఫ్‌వో వివేక్ తెలిపిన ప్రకారం.. తిరుపతికి చెందిన శివారెడ్డి మామిడి తోటలో అడవి పందుల కోసం వేటగాళ్లు.. పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్ నుంచి తీగలు లాగారు. కొద్ది రోజులుగా పులిచెర్ల మండలంలో తిరుగుతున్న 18 ఏనుగుల గుంపు శుక్రవారం రాత్రి చిన్నగొట్టిగల్లు మండలంలోని దిగవూరు, ఆరికలవారిపల్లె గ్రామాల పొలాల గూండా దేపట్లవారిపల్లె సమీపానికి వచ్చాయి. అదే గ్రామానికి చెందిన శంకర్ రెడ్డి టమోటా తోటను, పక్కనే ఉన్న మామిడి చెట్లను ధ్వంసం చేశాయి. దాని పక్కనే ఉన్న శివారెడ్డి మామిడి తోటలోకి వెళ్లగా.. అక్కడ అడవి పందుల కోసం అమర్చిన విద్యుత్ తీగలు ఏనుగు కాళ్లకు తగలడంతో ఆ విద్యుత్ తీగను తొండంతో లాగింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందింది. దీంతో వేటగాళ్లు ఏనుగు వద్ద విద్యుత్ తీగలను కత్తిరించుకుని వెళ్లిపోయారు. ఏనుగు తొండం వద్ద విద్యుత్ తీగ అలాగే ఉండిపోయింది. విద్యుత్ తీగ తగలడంతో ఏనుగు కాలు, తొండానికి గాయమైనట్లు డీఎఫ్‌వో తెలిపారు. సంఘటన స్థలాన్ని సీసీఎఫ్ సైల్వం, ఎఫ్ఆర్‌వో వెంకటరమణ, ట్రాన్స్‌కో ఏఈ రియాజ్ అహ్మద్ పరిశీలించారు. అనంతరం జూపార్కు వైద్యులు తోయిబా సింగ్ నేతృత్వంలో వైద్య బృందం, భాకరాపేట పశువైద్యాధికారి స్రవంతి ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించి అక్కడే ఖననం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆ రెండు ఊర్లలో కరెంటు తీసేశారు

ఎర్రావారిపాలెం, ఆంధ్రజ్యోతి: భాకరాపేట మండలం దేపట్లలవారిపల్లె సమీపంలో శుక్రవారం రాత్రి విద్యుదాఘాతంతో ఏనుగు మృతి చెందిన నేపథ్యంలో శనివారం రాత్రి రెండు గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిపేశారు. శనివారం రాత్రి 10 గంటలకు శాంతినగర్ చెరువులో 10 ఏనుగులు తిష్ట వేశాయి. తమ మందలోని ఏనుగు మృతి చెందితే ఆ సమీపంలోకి గుంపుగా చేరి ఘీంకరించి సంఘీభావం తెలుపుతాయి. ఆ పరిస్థితుల్లో మనుషులు కనిపిస్తే దాడి చేసే అవకాశం ఉంటుంది. అందుకని ఫారెస్టు అధికారులు, పోలీసులు సోషల్ మీడియాలో హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కొంతమంది రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు విద్యుత్ తీగలు వేస్తారేమోననే ఉద్దేశ్యంతో అధికారులు ఈ రెండు గ్రామాల పరిధిలో సరఫరాను నిలిపివేయించారు. దీంతో



గ్రామస్తుల్లో [illegible] ధ్వంసమైన పంట

ఎందుకీ మౌనం..?

వైసీపీ వీరవిధేయుల్లో ఆవేదన

తిరుపతి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తమ నాయకుడికి ఉమ్మడి చిత్తూరు జిల్లా పగ్గాలు వచ్చాయన్న ఆనందోత్సాహాలు కొద్దిరోజులకే వైసీపీ శ్రేణుల్లో ఆవిరైపోతున్నాయి.తిరుపతిలో కొందరు వైసీపీ కార్పొరేటర్లు కూటమి పార్టీల వైపు చూడడంతో ముఖ్యనాయకులు నైరాశ్యంలోకి వెళ్లిపోయారు. మున్సిపల్ ఎన్నికల చట్ట సవరణ నేపథ్యంలో వైసీపీ కార్పొరేటర్లు కూటమి పార్టీలో చేరేందుకు విజయవాడకు వెళ్లడం, జిల్లా ఇన్‌చార్జి మంత్రితో చర్చించడం వంటి పరిణామాలు వైసీపీ శ్రేణుల్లో గుబులు రేపుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి కుడిభుజంగా వ్యవహరించిన దొడ్డారెడ్డి సిద్దారెడ్డితో పాటు అతడి వర్గీయులు, భూమన ఫొటోను బంగారు ఉంగరాలు, లాకెట్లో వేసుకుతిరిగిన డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ టీడీపీలో చేరేందుకు ఉత్సాహం చూపించడంతో వైసీపీ వర్గాల్లో నిస్తేజం ఆవహించింది. ఉమ్మడి జిల్లా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన భూమన ఆయా నియోజకవర్గాల సమావేశాల్లో బిజీగా ఉంటున్నారు. ఆయన తనయుడు మాజీ డిప్యూటీ మేయర్ అభినయ్ కొన్నిరోజులుగా తిరుపతిలో కనిపించడంలేదు. అవిశ్వాసంపై ఏమి జరిగినా స్వాగతిస్తామన్నట్టుగా మేయర్ శిరీష ఉండడంతో వైసీపీ సీనియర్ కార్పొరేటర్లు ఆవేదనతో రగిలిపోతున్నారు. ఈ నేపథ్యంలో 'తిరుపతి రాజకీయం రివర్స్ అయిపోయింది. కాపాడుకోవాల్సిన వాళ్లు సైలెంట్ అయిపోయారు. కాపాడాల్సిన వారు కూడా మౌనం దాల్చారు' అంటూ భూమన ముఖ్య అనుచరుడు, కార్పొరేటర్ ఎస్కే బాబు తన ఆవేదనను శుక్రవారం సాయంత్రం ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. ఇది గమనించిన భూమన సాహితీ మిత్రుడొకరు.. 'ఏంది బాబూ ఇది?' అంటూ ఇంటిపోరును వీధిలో వేసుకుంటామా? అన్నట్టుగా అసంతృప్తితో కామెంట్ చేశారు. దీంతో కొద్దిసేపటికి ఫేస్‌బుక్ నుంచి తన పోస్టును ఎస్కే బాబు తొలగించారు. అప్పటికే రాజకీయ వర్గాల్లో ఆ పోస్ట్ వైరల్‌గా మారింది. చేజారిపోతున్న కార్పొరేటర్లను బుజ్జగించి కాపాడుకోవాల్సిన మేయర్ చేతులెత్తేయడం, తమకే బలముందని కార్పొరేటర్లతో సమావేశం ఏర్పాటుచేసి దిశానిర్దేశం చేయాల్సిన భూమన పట్టించుకోకపోవడం వైసీపీలో చర్చగా మారుతోంది.